ఆదివారం
09-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 286
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉక్రెయిన్ సమస్యకు రాజకీయ పరిష్కారం అవశ్యం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ శుక్రవారం దక్షిణ చైనాలోని గువాంగ్‌డాంగ్ ప్రావిన్స్ రాజధాని గువాంగ్‌జౌలో అనధికారికంగా భేటీ అయ్యారు. మాక్రాన్‌కు జిన్‌పింగ్ ఆత్మీయ స్వాగతం పలికారు.

2లో

కమ్యూనిస్టు అగ్రనాయకులు, భూపోరాట యోధ చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి నేడు....

మోదీ విషపు వ్యాఖ్యలు

అవినీతిని ప్రశ్నించిన విపక్షాలపై నిప్పులు

కుటుంబ పాలన-కేసీఆర్ ప్రభుత్వంపై పరోక్ష వ్యాఖ్యలు

వందేభారత్ ఎక్స్‌ప్రెస్, మౌలిక ప్రాజెక్టులకు శ్రీకారం

విశాలాంధ్ర-హైదరాబాద్: నిజాయితీగా పనిచేసేవారంటే అవినీతిపరులకు భయమని, వారు చేసే అవినీతి ప్రశ్నించారదట అంటూ ఇటీవల కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విపక్షాలపై ప్రధాని మోదీ వ్యంగాస్త్రాలు సంధించారు. తమ అవినీతిపై ఎవరూ దర్యాప్తు చేయకూడదని కొన్ని పార్టీలు సుప్రీంకోర్టుకు వెళ్లి నిరాశపడ్డాయని ఎద్దేవా చేశారు. మోదీ శనివారం తెలంగాణ రాష్ట్రంలో పర్యటించారు. అక్కడ బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్‌తో సహా 14 ప్రతిపక్ష పార్టీలు ఇటీవల సుప్రీంకోర్టుకు వెళ్లడంపై విమర్శలు గుప్పించారు. 'కొన్ని రోజుల కిందట రాజకీయ పార్టీల్లో కొన్ని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి అవినీతితో నిండిన మాపై ఎవరూ దర్యాప్తు జరపకుండా రక్షణ కల్పించండని

- మిగతా 2 లో

ఉద్యోగులపట్ల నిర్లక్ష్యధోరణి వీడకపోతే

ప్రత్యక్ష ఆందోళనలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం ఇంకా చిన్న చూపు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తే ప్రత్యక్ష ఆందోళనా కార్యక్రమాలకు సిద్ధపడతామని ఏపీజేఏసీ అమరావతి స్టేట్ ఛైర్మన్ బొప్పరాజు, సెక్రటరీ జెనరల్ పలిశెట్టి దామోదరరావు హెచ్చరించారు.

8లో

పండుగ పూటా పస్తులేనా?

మంత్రులు, ఎమ్మెల్యేలకు రంచన్‌గా ఒకటిన జీతాలు

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటికీ అందని వేతనాలు

- గుడ్ ఫ్రైడే, ఈస్టర్, రంజాన్ మాసమైనా కనికరించని ప్రభుత్వం
- సర్కారు తీరును నిరసిస్తూ రోడ్డెక్కిన కార్మికులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'మాది పేదల ప్రభుత్వం...పేదలకు ఎట్టిపరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే గొప్పలు చెప్పుకుంటారు. కానీ ఆచరణలో అది ఏమాత్రం కనిపించడం లేదు. పేదల పట్ల అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. నెల మొత్తం కాయకష్టం చేస్తూ జీతాల కోసం ఎదురుచూసే కార్మికుల సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పారిశుధ్యం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. శ్రమకు ముందు, ప్రయోజనాలకు చివర అన్న చందంగా వారి పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోంది. రెక్కాడితేగానీ డొక్కాడని మున్సిపల్ కార్మికులకు 8వ తేదీ వచ్చినా వేతనాలు ఇవ్వలేదు. ఆనందంగా జరుపుకోవాల్సిన గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలకు అర్థాకలితో పస్తులు గడిపే పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. ముస్లిం కార్మికులు అత్యంత భక్తి శ్రద్ధలతో రంజాన్ జరుపుకుంటారు. కానీ సకాలంలో వేతనాలందక ఆర్థిక సమస్యలతో వారు మానసిక వేదనకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. మంత్రులు, శాసనసభ్యులు, సలహాదారులు, ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఒకటో తారీఖున వేతనాలు చెల్లించి తమను మాత్రం 8వ తేదీ వచ్చినా ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శనివారం కార్మికులు రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. ఎన్నికల సందర్భంగా వైసీపీ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి... పర్మినెంట్ చేయకపోగా జీతాలు సైతం సక్రమంగా చెల్లించడం లేదని మండిపడుతున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం, పండుగ సెలవుల పేరుతో అధికారులు మభ్యపరుస్తున్నారని, మంత్రులు, ప్రజాప్రతినిధులకు లేని ఇబ్బంది, నిరుపేద కార్మికులకు జీతాలు ఇవ్వటానికి ఎందుకు వస్తున్నదని ప్రశ్నిస్తున్నారు. పేదల ప్రభుత్వంగా అభివర్ణించుకునే ముఖ్యమంత్రి...నిరుపేద మహిళా కార్మికులకు సైతం వేతనాలు ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారు? పండుగ సందర్భంగా కడుపు మాడ్చటం తగునా ? అని కార్మికులు నిలదీస్తున్నారు. ఓవైపు నింగినంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పన్నుల భారాలతో జీవనమే కష్టంగా మారగా...మరోవైపు జీతాలు సకాలంలో ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు వాపోతున్నారు. ఇంటి పన్నులు, చెత్త పన్నులు సకాలంలో కట్టకపోతే పెనాల్టీలు విధిస్తున్నారు. విద్యుత్ బిల్లులు కట్టకపోతే సరఫరా నిలిపివేస్తున్నారు. జీతాలు

- మిగతా 2 లో

మోదీ తీరు రాజ్యాంగ వ్యతిరేకం

- అది బీజేపీ సభా...ప్రభుత్వ సభా?
- జాతికి ప్రధాని క్షమాపణ చెప్పాలి
- నారాయణ డిమాండ్

2లో

పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన

- ఒకేసారి 39 మంది ఐపీఎస్‌ల బదిలీలు
- 12 జిల్లాల ఎస్పీలకు స్థానచలనం
- అర్ధరాత్రి దాటిన తర్వాత ఉత్తర్వులు జారీ
- 62కి చేరిన ఐఏఎస్‌ల బదిలీల సంఖ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో బదిలీల పర్వం కొనసాగుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఒకేసారి 56 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం, 24 గంటల వ్యవధిలోనే మరో ఆరుగురు ఐఏఎస్‌లతో పాటు 39 మంది ఐపీఎస్‌లను బదిలీ చేసింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఐపీఎస్‌ల బదిలీ ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం. అందరూ ఊహిస్తున్నట్లుగానే వైసీపీ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో భారీస్థాయిలో వరుసగా జరుగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలను గమనిస్తే ఇవన్నీ ఎన్నికల టీమ్‌లుగానే రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల ఎస్పీలకు స్థాన చలనం కలిగింది. ఏసీబీ అదనపు డైరెక్టర్‌గా పని చేస్తున్న జీవీజీ అశోక్ కుమార్‌ను ఏలూరు డీఐజీగా బదిలీ చేశారు. ఏలూరు డీఐజీగా పని చేస్తున్న జి.పాలరాజును గుంటూరు ఐజీ, దిశ ఐజీగా బదిలీ చేశారు. శాంతిభద్రతల ఏఐజీగా పని చేస్తున్న ఆర్.ఎన్.అమ్మిరెడ్డిని అనంతపురం డీఐజీగా పంపారు. అనంతపురం డీఐజీగా పని చేస్తున్న ఎం.రవిప్రకాశ్‌ను సెబ్ డీఐజీగా స్థానచలనం కల్పించారు. దిశ డీఐజీ బి.రాజకుమారిని ఏపీఎస్పీ బెటాలియన్స్ డీఐజీగా నియమించారు. ఏపీఎస్పీ విశాఖ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న కోయ ప్రవీణ్‌ను గ్రే హౌండ్స్ డీఐజీగా

- మిగతా 2 లో

కడపలో పోలీసు అరాచకం

- రామకృష్ణ, సీపీఐ నేతల అరెస్టు
- అఖిలపక్షం ధర్నా భగ్నానికి విఫలయత్నం
- టీడీపీ నేతల గృహనిర్బంధం
- డాక్టర్ అచ్చెన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్రబ్యూరో-కడప: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, దళితులపై దాడులే కాకుండా హత్యల పరంపర ఆగడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. దళితుల ఆక్రందనలే సీఎం జగన్ అంతానికి నాంది పలుకుతాయని హెచ్చరించారు. పోలీసుల దౌర్జన్యకాండ మితిమీరిందని, రాజ్యాంగేతర శక్తులుగా మారి అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తే ఉక్కుపాదం మోపుతున్నారని విరుచుకుపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డాక్టర్ అచ్చెన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏప్రిల్ 11న పూలే జయంతి సందర్భంగా అమరావతిలో సీఎం ఇంటిని ముట్టడిస్తామని రామకృష్ణ హెచ్చరించారు. కడపలో పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ అచ్చెన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన, అక్కడ ధర్నా కోసం రామకృష్ణ శనివారం ఇక్కడికి వచ్చారు. ధర్నాను విఫలం చేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడ అఖిలపక్ష నేతలను గృహ నిర్బంధం చేశారు. రామకృష్ణ బసచేసిన మానస ఇన్ హోటల్‌ను పోలీసులు చుట్టుముట్టారు. రామకృష్ణ బయటకు రాగానే సీపీఐ, ఇతర పార్టీల నేతలను అరెస్టు చేస్తున్నట్లు పోలీసులు నోటీసులు అందించారు. రామకృష్ణ సహా ఇతరులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా సీపీఐ శ్రేణులు పోలీసులపై తిరగబడ్డాయి. పోలీసుల దౌర్జన్యం నశించాలంటూ నినదించాయి. దీంతో రామకృష్ణతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, కార్యవర్గసభ్యులు నాగసుబ్బారెడ్డి, నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సుబ్రమణ్యం, బాదుల్లా, వీరశేఖర్, ఇతర నేతలను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్‌లో పడేశారు. ఆ వాహనాన్ని సీపీఐ నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టి అడ్డంగా పడుకున్నారు. సీపీఐ నేతలను పోలీసులు ఈడ్చి పడేశారు. దీంతో పోలీసులు, సీపీఐ శ్రేణులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. రామకృష్ణ వాహనాన్ని కదలనీయకపోవడంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించారు. బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గాలి చంద్ర సొమ్మసిల్లి పడిపోయారు. అనంతరం నాయకులను నగరంలోని పోలీసుస్టేషన్‌లతో పాటు చుట్టుపక్కల స్టేషన్లకు తరలించారు. ఆందోళనలో భాగంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఆర్‌సీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి సహా మరికొందరిని గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ అచ్చెన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ కోసం ఆందోళన చేయడానికి వచ్చిన తమను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని విమర్శించారు. తెల్లవారుజాము నుంచే పోలీసులు తనను చుట్టుముట్టారన్నారు. శాంతియుత ర్యాలీకి అనుమతివ్వకపోవడం విడ్డూరమన్నారు. మూడేళ్లుగా కడప జిల్లాలోనే

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇప్పుడు, మా ప్రభుత్వం కట్టిన ఇళ్లు కట్టేసిన ఇళ్లు, కట్టబోయే ఇళ్ల గురించి ఏకరుపు పెడతాను! వినండే!

రామనవమి మతహింస ఓ కుట్ర

గోహత్య చేసినది బీహెచ్‌ఎం వర్కర్లు

తేల్చిన ఆగ్రా పోలీసులు

లక్నో: రామనవమి సందర్భంగా ఆగ్రాలో చెలరేగిన మతహింస కుట్రపూరితమని నగర పోలీసులు వెల్లడించారు. భారత్ హిందూ మహాసభ (బీహెచ్‌ఎం) సభ్యులు కొందరు గోవులను హత్య చేసి ఆ నెపాన్ని మైనారిటీలపైకి నెట్టి చిచ్చుపెట్టగా అల్లర్లు జరిగాయని తెలిపారు. హిందూ మహాసభ జాతీయ అధికార ప్రతినిధి సంజయ్ జట్‌ను ప్రధాన సూత్రధారిగా పేర్కొన్నారు. ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. ఆగ్రా, గౌతంనగర్‌లోని ఎట్మాదుద్దౌలా ప్రాంతంలో రామ నవమి ఉత్సావాల సమయంలో తనిఖీలు జరిపి ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అల్లర్లకు వ్యూహం రచించిన మిగతా వారి కోసం గాలింపులు కొనసాగుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇదంతా సంజయ్ కుట్ర పథకం ప్రకారం జరిగిందని, కొందరు బీహెచ్‌ఎం వర్కర్లతో కలిసి ప్రత్యర్థుల (ముస్లింలు)పై నెపం నెట్టే విధంగా వ్యూహాన్ని రచించాడని చెప్పాయి. మార్చి 29వ తేదీ రాత్రి మెహతాబ్ బాగ్ ప్రాంతంలో గోహత్య జరిగింది. సంజయ్ కొందరు మిత్రులు, అనుచరులతో కలిసి గోవును వధించి ఆ నేరాన్ని తన ప్రత్యర్థులు మహమ్మద్ రిజ్వాన్, మహమ్మద్ నకీమ్, మహమ్మద్ సానుపై మోపుతూ కేసు నమోదు చేయమని సహచరుడు జితేంద్ర

- మిగతా 2 లో

ఉడుకుతున్న పుడమి

- భారత్‌లో 2022లో అధిక వేడిమి రోజులు అత్యధికంగా నమోదు
- ఉత్పాదకతలో తీవ్ర ప్రభావం
- కార్మికుల పని గంటల్లోనూ నష్టం
- సాగుకు తీరని నష్టం... ఆహార భద్రతకు ముప్పు

న్యూఢిల్లీ: అత్యధిక ఉష్ణోగ్రతలు పుడమికి ముప్పుగా పరిణమించాయి. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ నష్టాలు అధికమవుతున్నాయి. దేశంలో ప్రజల జీవనంపై, వ్యవసాయంపై అత్యంత ప్రభావం చూపుతున్నాయి. అధిక వేడి వాతావరణం కారణంగా పంట ఉత్పత్తుల దిగుబడి తగ్గిపోతోంది. ఇది రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. 2022లో ఉష్ణ గాలుల రోజుల సగటు సంఖ్య దశాబ్దంలో గరిష్ట స్థాయికి పెరిగింది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2022లో దేశంలో 190 అధిక వేడిమి రోజులు నమోదయ్యాయి. ఇది మునుపటి సంవత్సరం కంటే ఆరు రెట్లు ఎక్కువ. 1901వ సంవత్సరం నుంచి 2022 ఐదవ అత్యంత వేడిమి సంవత్సరంగా రికార్డుల్లోకి ఎక్కింది. 1981-2010 సంవత్సరాల సగటు కంటే ఉష్ణోగ్రతలు 0.51 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. విపరీతమైన వేడి, తేమ పరిస్థితుల

- మిగతా 2 లో

ఉక్రెయిన్ సమస్యకు రాజకీయ పరిష్కారం అవశ్యం

అనధికారిక భేటీలో జిన్‌పింగ్, మాక్రాన్



గువాంగ్‌జౌ: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ శుక్రవారం దక్షిణ చైనాలోని గువాంగ్‌డాంగ్ ప్రావిన్స్ రాజధాని గువాంగ్‌జౌలో అనధికారికంగా భేటీ అయ్యారు. మాక్రాన్‌కు జిన్‌పింగ్ ఆత్మీయ స్వాగతం పలికారు. మూడేళ్ల తర్వాత ఇద్దరు చైనాలో కలుసుకోవడంపై హర్షం వ్యక్తంచేశారు. అధినేతలు బైయున్ కొండ వద్ద పైన్‌గార్డెన్‌లో కలియ తిరుగుతూ కబుర్లు చెప్పుకున్నారు. ప్రకృతి అందాల నడుమ తేనేటిని ఆశ్వాదించారు. గతాన్ని నెమరవేసుకున్నారు. వర్తమానాన్ని చర్చించారు. బైయున్ హాల్‌లో గుక్విన్ మెలడీ 'హై మౌంటెయిన్, ఫ్లోయింగ్ వాటర్' (సంగీతాన్ని) వింటూ ఆనందించారు. అనంతరం రాత్రి విందు కోసం మాక్రాన్‌ను జిన్‌పింగ్ ఆహ్వానించారు. అంతకుముందు మాక్రాన్‌తో జిన్‌పింగ్ మాట్లాడుతూ ప్రస్తుత చైనాను అర్థం చేసుకోవాలంటే ముందు దాని చరిత్రను తెలుసుకోవాలని అన్నారు. 'గువాంగ్‌జౌ చైనా ప్రజాస్వామిక విప్లవగడ్డ. ప్రస్తుతం గువాంగ్‌డాంగ్-హాంగ్‌కాంగ్-మకావ్ గ్రేటర్ బే ప్రాంతాభివృద్ధి జరుగుతోంది. అత్యున్నత నాణ్యతగల అభివృద్ధి జరిగే విధంగా తన వంతు కృషిని గువాంగ్‌జౌ అందిస్తోంది' అంటూ చైనా ఆధునికీకరణకు సంబంధించి కొన్ని కీలకాంశాలు, లక్షణాలను మాక్రాన్‌కు వివరించారు.

'చైనా భవిష్యత్ అభివృద్ధిపై పూర్తి విశ్వాసం ఉంది. చైనా ఎగుమతి, దిగుమతిలో క్రియాశీల భాగస్వామ్యం కోసం ఫ్రాన్స్‌ను ఆహ్వానిస్తున్నాం. చైనా అంతర్జాతీయ దిగుమతి ఎక్స్‌పో, చైనా అంతర్జాతీయ వర్తకం, వాణిజ్య సేవల పరిధిని పెంచుతూ చైనా మార్కెట్‌ను విస్తరిస్తున్నట్లు జిన్‌పింగ్ తెలిపారు. మాక్రాన్ మాట్లాడుతూ నిజమైన స్నేహమంటే ఒకరంటే ఒకరికి గౌరవం, అవగాహన ఉండటమే అని అన్నారు. తమ దేశంతో పాటు యూరప్‌కు నిరంతర తోడ్పాటు అందిస్తున్నందుకు చైనాను ఫ్రాన్స్ అభినందిస్తుందని చెప్పారు. రెండు దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను, బహిరంగ మార్కెట్ల అవసరాలు-అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం-పారిశ్రామిక సహకారాన్ని పెంచుకోవడానికి ఫ్రాన్స్ సిద్ధంగా ఉందని అన్నారు. కృత్రిమ మేధస్సుకు సంబంధించి సహకారాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం గురించీ ఇద్దరు అధినేతలు చర్చించారు. ఇటువంటి దీర్ఘకాలిక సంక్షోభ స్థితి వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు. సాధ్యమైనంత త్వరగా యుద్ధం ముగియడం అందరికీ మంచిదని చెబుతూ రాజకీయ పరిష్కారం ఒక్కటే మార్గమని అన్నారు. చైనా స్వలాభం కోసం ఉక్రెయిన్ అంశాన్ని వాడుకోదని, నిజం, న్యాయం పక్షానే నిలుస్తుందని జిన్‌పింగ్ అన్నారు. ఈ సమస్యకు రాజకీయ పరిష్కారం కోసం అందరూ కలిసిరావాలని అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభానికి ఫ్రాన్స్ ప్రతిపాదించిన రాజకీయ పరిష్కారాన్ని చైనా స్వాగతిస్తుందన్నారు.

అలాగే చైనా, ఫ్రాన్స్ సంబంధాలు, చైనా-ఈయూ సంబంధాలు, ఇతర అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై ఇద్దరు ఒకే తరహా ఆలోచనలను కలిగివుండటం హర్షణీయమన్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక, అంతర్జాతీయ సహకారాన్ని మెరుగుపర్చుకోవాలని సంకల్పించారు. వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలతో పాటు చైనా, ఫ్రాన్స్ ప్రజల మధ్య పరస్పర మైత్రిని పెంపొందించుకునేందుకు రెండు దేశాలు కృత నిశ్చయంతో ఉన్నాయని జిన్‌పింగ్ చెప్పారు.

దక్షిణ అమెరికన్ బ్లాక్‌లోకి బ్రెజిల్

సావోపౌలో: యూనియన్ ఆఫ్ సౌత్ అమెరికన్ నేషన్స్ (యూఎన్‌ఏఎస్‌యూఆర్)లో తిరిగి చేరుతున్నట్లు బ్రెజిల్ ప్రకటించింది. అంతర్జాతీయ కూటముల పునరుద్ధరణ క్రమంలో యూఎన్‌ఏఎస్‌యూఆర్‌లో చేరుతున్నట్లు ఆ దేశ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మే 6 నుంచి ఈ బ్లాక్‌లో బ్రెజిల్ ఉండనున్నట్లు వెల్లడించింది. తద్వార శాంతి, సహకారం, ప్రాదేశిక సమగ్రతను పెంపొందించుకునేందుకు ఆస్కారం కలుగుతుందని పేర్కొంది. యూఎన్‌ఏఎస్‌యూఆర్ 2008లో ఏర్పాటైంది. ఇందులో 12 దక్షిణ అమెరికా దేశాలు ఉన్నాయి. కాగా, 2019 ఏప్రిల్‌లో ఈ యూనియన్ నుంచి బ్రెజిల్ అధికారికంగా వైదొలగింది.

చైనా ప్రస్తుతం ఏ దశలో ఉన్నది?

సి.ఎ.రూసో (రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టు పార్టీని బలపరిచే వెబ్‌సైట్)

ఎడిటర్స్ అడిగిన రెండు ప్రశ్నలకు చైనీస్ అకాడమీ ఆఫ్ సోషల్ సైన్సెస్ అకడమీషియన్ చెంగ్ ఎన్‌ఫూ ఇచ్చిన సమాధానాన్ని దిగువనిస్తున్నాం.

అలెగ్జీ బ్రాజిన్ ప్రశ్న

ఆధునిక చైనాకి సంబంధించి ప్రతి విషయం నాకు, రష్యన్ కమ్యూనిస్టులకు చాలా ఆసక్తికరంగా ఉంటున్నది. చైనా గురించి ఒక మౌలిక ప్రశ్న మేము అడగదలిచాం. దానికి జవాబు మీ నుంచి ఆశిస్తున్నాం. ఇది పాఠకులకు కూడా చాలా ఆసక్తికరమైనది. ఆ ప్రశ్నకు మీరు వివరణ ఇవ్వగలరా? చైనాలో కేపిటలిస్ట్ ఆర్థిక వ్యవస్థను ఎప్పటికి నిర్మూలించగలుగుతారని చైనా కమ్యూనిస్టులు ప్రణాళికను రూపొందించారు. మరొక విషయం, కమ్యూనిస్టులందరికి ప్రధాన లక్ష్యం 'ప్రైవేటు ఆస్తి నిర్మూలన పథకాన్ని' చైనా కామ్రేడ్లు విసర్జించారా?

అకడమీషియన్ సమాధానం:

ప్రియమైన కామ్రేడ్ అలెగ్జీ బ్రాజిన్, నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నందుకు కృతజ్ఞతలు.

చైనా కమ్యూనిస్టు పార్టీ నిబంధనావళి ఒక విషయాన్ని స్పష్టీకరించింది. అది కమ్యూనిజాన్ని సాధించడం. ప్రస్తుత నాయకత్వం దాన్ని పునరుద్ఘాటించింది. కమ్యూనిజం వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్యం నిశ్చయంగా ఉండదు. కేపిటలిస్ట్ అంశాన్ని అంతిమంగా ఎప్పుడు నిర్మూలిస్తారన్న దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వ్యక్తిగతంగా నా అంచనా ప్రకారం ఇది త్వరలోనే సాధ్యమవుతుందని ఆశిస్తున్నాను. ఈ దశలో ప్రధానమైన కర్తవ్యం రెండు కీలకాంశాలపై ఏకాభిప్రాయానికి రావడం. ఒకటి, ఆధిపత్య వాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో క్రియాశీల సమిష్టి పోరాటం జరపడం. రెండు, చైనాలో స్టేట్ యాజమాన్యాన్ని బలపర్చడం, విస్తృతపర్చడం.

ప్రశ్న: ప్రియమైన కామ్రేడ్ చెంగ్ ఎన్‌ఫూ మా పాఠకులు ఒక ముఖ్యమైన ప్రశ్న అడుగుతున్నారు. చైనా కమ్యూనిస్టుల అంచనా ప్రకారం ప్రస్తుతం చైనా ఏ దశలో ఉన్నది? మాతో పాటు రష్యన్ మార్క్సిస్టుల అంచనా ప్రకారం చైనాలో ఉన్న ప్రస్తుత దశ కేపిటలిజం నుంచి సోషలిజానికి పరివర్తనా దశ గురించి చైనా కమ్యూనిస్టులు ఏమి ఆలోచిస్తున్నారు?

చెంగ్ ఎన్‌ఫూ సమాధానం

నా అభిప్రాయాన్ని స్పష్టీకరిస్తాను. కారల్ మార్క్స్, వి.ఐ. లెనిన్ వారి సూత్రీకరణ ప్రకారం సోషలిస్టు సమాజం ఆర్థిక వ్యవస్థ ప్రమాణాలను అనుసరించి, నేటి చైనా కేపిటలిస్ట్ నుంచి సోషలిస్టు సమాజానికి మారే పరివర్తనా దశలో నేడున్నది. ఇలాగే వియత్నాం కమ్యూనిస్టు పార్టీ అంచనా కూడా ఉన్నది.

అయితే చైనాలో ఉన్న ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన స్రవంతి సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ స్వభావాన్ని కలిగివున్నదా! ఈ విషయంలో చైనా మేధావులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. నా అభిప్రాయం స్పష్టం. ఏమంటే... చైనాలో ప్రైవేటు ఆర్థిక వ్యవస్థ భాగం ఇక ఏ మాత్రం పెరుగుదల ఉండదు. కానీ చాలా మంది అభిప్రాయం దీనికి అనుకూలంగా లేదు.

మీరు సాగిస్తున్న కృషి విజయవంతం అవుతుందని ఆశిస్తున్నా...

ప్రచార ఆందోళన విజయవంతం చేయాలి

కేవీవీ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర-కూచిపూడి: "బీజేపీ హఠావో దేశ్ బచావో"నినాదంతో ఈ నెల 14 నుంచి 30వరకు సీపీఐ, సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా సంయుక్తంగా నిర్వహించే ప్రచారాందోళన కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా మొవ్వ మండలం కూచిపూడి-పెదపూడి సెంటర్‌లోని చలసాని కాంచనరావు భవన్ (సీపీఐ) కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని విమర్శిస్తూ ప్రసంగించారు. తొలి రోజు అయిన 14న జిల్లా కేంద్రాలలో నిర్వహించే ప్రచార ఆందోళన కార్యక్రమంలో ప్రతినిధులు, పార్టీ నాయకులు, సభ్యులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగంనడ్డి విరిచే విధంగా వ్యవహరిస్తూ వ్యవసాయ రంగాన్ని నష్టాల పాల్జేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగడుతూ చేస్తున్న ఆందోళనను విజయవంతనికి కృషి సల్పాలని పార్టీ సభ్యులకు సూచించారు. ఈ సమావేశానికి హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షత వహించారు. జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టీ తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌దివి ఏరియా పూర్వ కార్యదర్శి మాలెంపాటి కాంచనరావు, రైతు సంఘ నాయకులు వెలగపూడి అజాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మోదీ తీరు రాజ్యాంగ వ్యతిరేకం

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: హైదరాబాదులో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, వందేభారత్ రైలును ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ... బీఆర్ఎస్ పార్టీపై ఆరోపణలు చేయడం రాజ్యాంగ, లౌకిక వ్యవస్థకు వ్యతిరేకమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మండిపడ్డారు. తక్షణం నరేంద్ర మోదీ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కోసం సభ నిర్వహించి...ప్రధానమంత్రి హోదాలో వచ్చిన మోదీ...దానిని బీజేపీ సభగా మార్చివేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నేతగా వచ్చారా లేక ప్రధానిగా వచ్చారా సమాధానం చెప్పాలని మోదీని డిమాండ్ చేశారు. మోదీ ప్రసంగం మొత్తం తెలంగాణ ప్రభుత్వంపై దాడిగానే సాగిందన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నప్పుడు కేసీఆర్ అవినీతి కనిపించలేదా అని నారాయణ ప్రశ్నించారు. 'జై కొడితే ఇళ్లకు...ఛీ కొడితే జైలుకు' అన్న చందంగా మోదీ పాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కుట్రలను బీజేపీ నిరంతరం కొనసాగిస్తోందని, అందులో భాగంగానే తమిళనాడులో మోదీ కులప్రస్తావనల తీసుకొస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ యేతర పాలక రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వకుండా పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నదని చెప్పారు. జీఎస్టీ రూపంలో ప్రజల నుండి వసూలు చేసిన డబ్బును మోదీ ఇష్టానుసారం ఖర్చు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అదానీ అక్రమాలపై జేపీసీ వేయాలన్న డిమాండ్ తెరపైకి రాగానే కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి రాజకీయ శిక్ష వేశారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకం, ప్రాజెక్టు తీసుకొచ్చినా ప్రజాధనంతోనేనని, వందే భారత్ రైళ్లను ప్రారంభించడం అందులో భాగమేనని నారాయణ చెప్పారు. వందే భారత్ రైళ్ల చార్జీలు విమాన చార్జీలను తలపిస్తున్నాయని ఆరోపించారు. త్వరలో వీటిని కూడా ప్రైవేట్ వ్యక్తులకు మోదీ అప్పగిస్తారని చెప్పారు. నరేంద్రమోదీ ప్రభుత్వ తీరును ఎండగట్టడానికి 19 రాజకీయ పార్టీలు ఏకతాటిపైకివచ్చాయని, ప్రజాక్షేత్రంలో మోదీ సర్కారును ముద్దాయిగా నిలబెడతామని నారాయణ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి విలయతాండవం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఆర్థిక నేరగాళ్లకు నిలయంగా మారిందన్నారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం నుండి వచ్చిన నిధులను సీఎం జగన్ దారిమళ్లిస్తుంటే ఉండవల్లి ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు ఉదయ్ పాల్గొన్నారు.

ఉడుకుతున్న పుడమి

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా 2030 నాటికి భారతదేశం 2.5-4.5 శాతం జీడీపీ నష్టాన్ని కోల్పోతుందని ప్రపంచ బ్యాంక్ నివేదిక సూచిస్తోంది. అధిక వేడిమి రోజులు పెరుగుదలకు సంబంధించిన కొన్ని అంశాలను పరిశీలిస్తే... 2013 నాటి నుంచి అత్యధికంగా 2022లో అత్యధిక వేడిమి రోజులు నమోదయ్యాయి. అలాగే పంజాబ్, రాజస్థాన్, జార్ఖండ్, హరియాణా, ఢిల్లీ ఈ ఐదు రాష్ట్రాల్లో 2022లో అధిక వేడి రోజుల వాటా 57 శాతంగా ఉంది. 2021లో ఈ రాష్ట్రాల వాటా 38 శాతం. అయితే కర్నాటక, అసోం, హిమాచల్ ప్రదేశ్‌లో 2022లో ఒక్క అధిక వేడిమి రోజు కూడా నమోదు కాకపోవడం విశేషం. దేశంలో అధిక వేడిమి రోజుల సంఖ్య పెరుగుదల ఫలితంగా ఏర్పడే ఇబ్బందులను పరికిస్తే... ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, భారతదేశ జీడీపీలో 40 శాతం అధిక వేడిమి ప్రభావంపై ఆధారపడి ఉంటుంది. 2030 నాటికి, వేడి ఒత్తిడి కారణంగా ఉత్పాదకత క్షీణత ఫలితంగా 3.4 కోట్ల ఉద్యోగ నష్టాలు ఉండవచ్చునని అంచనా. ఉష్ణోగ్రతల్లో పెరుగుదలతో కార్మికుల పని గంటలు కోల్పోవడం ఫలితంగా జీడీపీలో 2.5 నుంచి 4.5 శాతం నష్టానికి దారితీస్తుందని భావిస్తున్నారు. 2022లో ఉష్ణోగ్రత 0.51 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉండగా, 2040 నాటికి 0.8 డిగ్రీల సెల్సియస్, 2041-2060 నాటికి 1.3 డిగ్రీల సెల్సియస్, 2081-20100 నాటికి 1.4 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత పెరగవచ్చని ఐపీసీసీ నివేదిక పేర్కొంది. సగటున అధిక వేడిమి రోజులు రాజస్థాన్‌లో 26, హరియాణాలో 24, పంజాబ్‌లో 24, జార్ఖండ్‌లో 18, ఢిల్లీలో 17, ఉత్తర ప్రదేశ్‌లో 15, ఉత్తరాఖండ్‌లో 15, మధ్య ప్రదేశ్‌లో 13, బీహార్‌లో 6 రోజులుగా ఉన్నాయి.

పంటలకు తీవ్ర ముప్పు

విపరీతమైన ఉష్ణోగ్రతలు లేదా వర్షంతో రోజుల సంఖ్య పెరుగుదల భారతదేశం అంతటా విత్తనాల నాణ్యత, పరిమాణంలో క్షీణతకు కారణమైంది. అసాధారణ వాతావరణ సంఘటనలు పంటలలో విత్తనాలుగా ఉపయోగించేందుకు సరిపడా గింజలు లేవు. వాతావరణ మార్పు వల్ల దేశ ఆహార భద్రతకు అవసరమైన విత్తనాలకు ముప్పు ఏర్పడింది. ప్రభుత్వ ప్రజాపంపిణీ వ్యవస్థలో పంపిణీ చేయబడే రెండు ప్రధానమైన ఆహార భద్రతకు కీలకమైన గోధుమలు, బియ్యం ధాన్యాలు కూడా ఇటీవలి సంవత్సరాలలో తగ్గిపోతున్నాయని రైతులు అంటున్నారు. ఆగస్టు 2022లో పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్ వరిలో మరగుజ్జు వైరస్ వ్యాప్తి చెందింది. మే, జూన్‌లో అధిక ఉష్ణోగ్రతలు వ్యాధి వ్యాప్తికి కారణాలలో ఒకటి. 25 డిగ్రీల సెల్సియస్ కంటే 1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదల పునరుత్పత్తి దశను 6 శాతం తగ్గిస్తుంది. మరో ప్రధాన పంట వరి కూడా అధిక వేడి, వర్షాలు, భారీ గాలుల కారణంగా ప్రతికూలంగా ప్రభావితమవుతుంది. వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదల రేటు గత 50 ఏళ్లలో క్షీణించిందని, ప్రధానంగా మధ్య, తక్కువ-అక్షాంశ ప్రాంతాలలో సంబంధిత ప్రతికూల ప్రభావాలు' ఉన్నాయని ఇటీవల విడుదలయిన ఐపీసీసీ సంశ్లేషణ నివేదిక పేర్కొంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే టమాటా పంటపై ప్రభావం పడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కాగా, గత 50 ఏళ్లలో విపరీతమైన వాతావరణ పరిస్థితులు పెరిగాయని, రానున్న 50 ఏళ్లలో మరింత పెరిగే అవకాశం ఉందని బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి చెందిన వాతావరణ మార్పు, పర్యావరణం, సుస్థిర అభివృద్ధి పరిశోధన సంస్థ ప్రధానాధికారి, ప్రొఫెసర్ రాజేష్ కుమార్ మాల్ తెలిపారు. 'గత 50 ఏళ్లలో అధిక వేడిమి గాలులు పెరిగాయని పరిశోధనలో తేలింది. రానున్న 50 ఏళ్లలో ఇవి మరింత పెరుగుతాయని అంచనా. అంతేకాకుండా, గత 20 సంవత్సరాలలో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా వంటి కొత్త ప్రాంతాలు వేడిగాలులను అనుభవించడాన్ని మనం చూశాము. ఈ ప్రాంతాలు కొత్త అధిక వేడిమి ప్రాంతాలుగా ఉద్భవించాయి' అని వివరించారు.

కడపలో పోలీసు అరాచకం

(మొదటిపేజీ తరువాయి)

విధులు నిర్వహిస్తున్న ఎస్పీ అన్బురాజన్ డాక్టర్ అచ్చెన్న కేసులో తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. డాక్టర్ అచ్చెన్న అవినీతి రహితుడిగా పేరుపొందారన్నారు. సహ ఉద్యోగులు ఆయనపై అసహనం పెంచుకొని హత్య చేయడం దారుణమని రామకృష్ణ చెప్పారు. డా.అచ్చెన్న హత్యపై ఫిర్యాదు చేసినా పోలీసులు సకాలంలో స్పందించలేదన్నారు. కనీసం పోస్టుమార్టం విషయం కూడా కుటుంబసభ్యులకు తెలియకుండా పోలీసులు జాగ్రత్త పడ్డారన్నారు. సమాజంలో గౌరవం తెచ్చుకున్న డాక్టర్ అచ్చెన్న కుటుంబానికే సీఎం జగన్ న్యాయం చేయకపోతే...సామాన్యులను ఎలా పట్టించుకుంటారని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రభుత్వ వేధింపుల కారణంగానే డాక్టర్ సుధాకర్ ఆత్మహత్య చేసుకున్నారని, కాకినాడలో వైసీపీ ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపి...మృతదేహాన్ని తల్లిదండ్రులకు డోర్‌డెలివరీ చేశాడని విమర్శించారు. డాక్టర్ అచ్చెన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాల్సిందేనని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సీపీఎం నాయకులు చంద్రశేఖర్, రామమోహన్, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రామనవమి మతహింస ఓ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

కుష్వాహాకు సూచించాడు. కుష్వాహ అదే రోజున ఎట్మాదుద్దౌలా పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్లు ఉన్న వారి అరెస్టును డిమాండ్ చేస్తూ పోలీసు స్టేషన్‌ను రెండుసార్లు ఘెరావ్ చేశాడు. ఈ కేసు గురించి ఆగ్రా డీసీపీ సూరజ్ రాయ్ మాట్లాడుతూ ఎఫ్ఐఆర్‌లో పేర్లున్న వారికి ఈ నేరంతో సంబంధమే లేదన్నారు. సంజయ్ తన ప్రత్యర్థులను ఇరికించేందుకు సహచరుడు కుష్వాహాతో కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మరోవైపు తనను ఈ కేసులో కొందరు బీహెచ్ఎం ఆఫీసు బేరర్లు ఇరికించే ప్రయత్నం చేస్తున్నట్లు సంజయ్ విలేకరులతో చెప్పాడు. సీబీసీఐడీతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశాడు. సంజయ్ గతంలో దోపిడీ కేసులో అరెస్టు కాగా ప్రస్తుతానికి అతనికి బెయిల్ లభించింది. అతను, అతని సహచరులు తరచూ బీఫ్ రవాణా వాహనాలను అడ్డుకొని బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేస్తారని, ఈ మేరకు అనేక కేసులు నమోదయ్యాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ఆర్థిక మాంద్యంతో ఆకలి, దారిద్ర్యం ముప్పు: ఐఎంఎఫ్

న్యూయార్క్: ప్రపంచ ఆర్థిక మాంద్యంలో ఆకలి, దారిద్ర్యం పెరగనున్నట్లు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) హెచ్చరించింది. గతేడాది కంటే ఈ ఏడాది తక్కువ వృద్ధి సాధించడాన్ని సంస్థ ఎండీ క్రిస్టలినా జార్జివా తెలిపారు. వచ్చే ఐదేళ్ల వృద్ధిరేటు దాదాపు మూడు శాతంగా ఉంటుందన్న అంచనా ఉందన్నారు. 1990 నుంచి ఇప్పటివరకు ఇదే అతితక్కువ వృద్ధి అంచనాగా తెలిపారు. తక్కువ ఆదాయం దేశాలకు ముప్పు పొంచివుందని హెచ్చరించారు. కోవిడ్ వల్ల ప్రారంభమైన ప్రమాదకరమైన ధోరణి దారిద్ర్యం, ఆకలి మరింత పెరుగుతాయన్నారు.

భారీ ప్రక్షాళన

(మొదటిపేజీ తరువాయి)

బదిలీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా విధులు నిర్వహిస్తున్న శంఖబ్రత బాగ్చీని శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీగా బదిలీ చేశారు. శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా బదిలీ చేశారు. ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ అదనపు డీజీపీ అతుల్ సింగ్‌ను పోలీసు నియామక మండలి చైర్మన్, అదనపు డీజీపీ, ఏపీఎస్పీ బెటాలియన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. పోలీసు నియామక మండలి చైర్మన్‌గా ఉన్న మనీష్ కుమార్ సిన్హా ప్రస్తుతం సెలవులపై వెళ్లగా ఆయన స్థానంలో అతుల్ సింగ్‌ను బదిలీ చేశారు. విశాఖపట్నం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ శ్రీకాంత్‌ను సీఐడీ ఐజీగా బదిలీ చేశారు. గుంటూరు ఐజీ సీఎం త్రివిక్రమ వర్మను విశాఖపట్నం కమిషనర్‌గా, విజయనగరం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న విక్రాంత్ పాటిల్‌ను పార్వతీపురం మన్యం ఎస్పీగా బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం ఎస్పీ వాసన్ విద్యాసాగర్ నాయుడును విశాఖపట్నం శాంతిభద్రతల డీసీపీగా, విశాఖపట్నం శాంతిభద్రతలు డీసీపీగా ఉన్న గరుడ్ సుమిత్ సునీల్‌ను ఎస్‌బీఐ ఎస్పీగా, పాడేరు అదనపు ఎస్పీ తుహిన్ సిన్హాను అల్లూరి సీతారామరాజు ఎస్పీగా, అల్లూరి సీతారామరాజు ఎస్పీ ఎస్.సతీష్ కుమార్‌ను కాకినాడ ఎస్పీగా బదిలీ చేశారు. కాకినాడ ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబును పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనకాపల్లి ఎస్పీ గౌతమి శాలిను విశాఖపట్నం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. డా.అంబేద్కర్ కోనసీమ ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డిని తూర్పుగోదావరి ఎస్పీగా పంపించారు. విజయవాడ శాంతిభద్రతల డీసీపీ డి.మేరి ప్రశాంతిని ఏలూరు ఎస్పీగా బదిలీ చేశారు. ఏలూరు ఎస్పీ రాహుల్ దేవ్ శర్మను విజయనగరం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా స్థానచలనం కల్పించారు. నెల్లూరు ఎస్పీ సీహెచ్ విజయరావును కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా, ఏసీబీ ఎస్పీ ఆర్.గంగాధర్ రావును అన్నమయ్య జిల్లా ఎస్పీగా, అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజును సీఐడీ ఎస్పీగా, అనంతపురం ఎస్పీ ఫక్కీరప్పను సీఐడీ ఎస్పీగా, సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్‌ను విజయవాడ రైల్వే ఎస్పీగా బదిలీ చేశారు. కర్నూలు ఎస్పీ సిద్దార్థ కౌశల్‌ను ఆక్టోపస్ ఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది. మరోవైపు పోస్టింగ్‌ల కోసం నిరీక్షిస్తున్న ఆరుగురు ఐపీఎస్‌లను కూడా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.వి.మాధవ్ రెడ్డిని సత్యసాయి జిల్లా ఎస్పీగా, కె.శ్రీనివాసరావును అనంతపురం ఎస్పీగా, తిరుమలేశ్వర్ రెడ్డిని నెల్లూరు ఎస్పీగా, పి.శ్రీధర్‌ను డా.అంబేద్కర్ కోనసీమ ఎస్పీగా, కె.వి.మురళీకృష్ణను అనకాపల్లి ఎస్పీగా, సర్వశేష్ఠ త్రిపాఠిని పరిపాలన, పోలీసు ప్రధాన కార్యాలయం డీఐజీగా బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మరో ఆరుగురు ఐఏఎస్‌ల బదిలీ

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో ఆరుగురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న కె.విజయానంద్‌కు ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలను అప్పగించింది. సర్వశిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న ఎస్.సురేష్‌కుమార్‌ను బదిలీ చేసి ఆ స్థానంలో బి.శ్రీనివాసరావును నియమించింది. ఐఏఎస్ అధికారి వెట్రిసెల్విని సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలంటూ గురువారం ఇచ్చిన బదిలీ ఉత్తర్వులను నిలిపేసింది. ప్రసవ సెలవుపై వెళ్లిన నారపురెడ్డి మౌర్యను కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించింది. నెల్లూరు మున్సిపల్ కమిషనర్ హరితను తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఆ స్థానంలో వికాస్ మర్మత్‌ను నియమించింది. బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ (విజిలెన్స్)గా వ్యవహరిస్తున్న చామకూరి శ్రీధర్‌ను నియమించింది. బాపట్ల జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌ను ప్రకాశం జిల్లా జేసీగా నియమించింది.

పండుగ పూటా పస్తులేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పుడిచ్చినా, పస్తులు గడుపుతున్నా తాము మాత్రం విధులు సక్రమంగా నిర్వహించాలా? ఇదేం న్యాయమని ప్రశ్నిస్తున్నారు. మార్చి 30వ తేదీ శ్రీరామనవమి, ఈనెల 6వ తేదీ గుడ్ ఫ్రైడే, 8వ తేదీ ఈస్టర్ పండుగ, ప్రస్తుతం రంజాన్ మాసం నడుస్తోంది. ముస్లిం సోదరులంతా ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుంటారు. కనీసం ఇటువంటి ప్రత్యేక సందర్భాలలోనైనా కార్మికులను ఇబ్బందిపెట్టకుండా జీతాలు సక్రమంగా చెల్లించాలన్న బాధ్యత అధికార యంత్రాంగానికి లేకపోవడం దారుణమని కార్మిక నేతలు విమర్శిస్తున్నారు. పండుగ సమయాల్లో పారిశుధ్య, ఇతర సిబ్బందికి సెలవు ఇవ్వటం లేదు. పని భారం విపరీతంగా పెంచారు. కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ సొమ్ము పూర్తిగా వారి ఖాతాలలో జమ చేయడం లేదు. పేర్ల నమోదులో తప్పులు చూపి కార్మికులను నానా ఇబ్బందులు పెడుతున్నారు. పీఎఫ్ సొమ్మును దారి మళ్లిస్తున్నారు. ఆరోగ్య బీమా (ఈఎస్ఐ) కార్మికుల సొమ్ముతో నడుస్తున్నా, వారికి ఆ ప్రయోజనాలు అందడం లేదు. ఇక వైద్య సౌకర్యం అరకొరగానే ఉంది. మందుల సరఫరా పూర్తిస్థాయిలో లేదు. అనారోగ్యం సందర్భంలో వారికి ఇవ్వవలసిన సెలవుల డబ్బు పూర్తిగా జమ చేయడం లేదు. ఇలా అనేక సమస్యలతో కార్మికులు అవస్థలు పడుతున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. సర్కారు తీరు మార్చుకోకుండా, కార్మికుల పట్ల ఇదే రకంగా వివక్షను కొనసాగిస్తే కార్మికాగ్రహం చవిచూడాల్సి వస్తుందని కార్మికసంఘం నేతలు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

మోదీ విషపు వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

వేడుకున్నాయి. కానీ కోర్టు వారికి షాక్ ఇచ్చింది' అని మోదీ విమర్శించారు. అవినీతి, కుటుంబ పాలన గురించి వ్యాఖ్యానించారు. తెలంగాణలో అభివృద్ధిని అడ్డుకోవద్దని రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వానికి సూచించారు. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేదన్న ఆరోపణలు బాధించాయని, రాష్ట్ర అభివృద్ధి కోసం తాము ఎంతో చేశామని చెప్పుకున్నారు. కొందరు కుటుంబ పరిపాలనను ప్రోత్సహిస్తున్నారని ఎవరి పేరు ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. తెలంగాణలో కేంద్రం అమలు చేసే ప్రాజెక్టుల ద్వారా లబ్ది పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రాజెక్టుల్లో రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం రూపొందించే అభివృద్ధి ప్రణాళికలు, చేపట్టే కార్యక్రమాలను అడ్డుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. 'పరివార్‌వాద్', 'అవినీతి' రెండు వేర్వేరు కాదని, కుటుంబ పాలన ఎక్కడ ఉంటే అక్కడ అవినీతి రాజ్యమేలుతుందని, తెలంగాణలోనూ అలాంటి కుటుంబమే ఉందని, దాన్ని చట్టప్రకారం శిక్షించాలా వద్దా చెప్పండని సభకు వచ్చిన వారిని ప్రశ్నించారు. కోవిడ్ మహమ్మారి, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులకు గురవుతున్నా మౌలికవసతులు, ఆధునికీకరణపై రికార్డుస్థాయిలో వెచ్చించిన దేశాల్లో భారత్ ఒకటని గొప్పలు పోయారు. ఈ ఏడాది బడ్జెట్‌లో మౌలిక వసతుల ఆధునికీకరణ కోసం రూ.10లక్షల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

మోదీ అంతకుముందు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ రైలు సికింద్రాబాద్-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 13 ఎంఎంటీఎస్ సేవలను ప్రారంభించారు. బీబీనగర్ ఎయిమ్స్ ఆధునిక భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక నుంచి అనేక మౌలికవసతుల ప్రాజెక్టులనూ ప్రారంభించారు. మోదీ ప్రసంగిస్తూ తెలంగాణ ప్రభుత్వం అవినీతిని పెంచిపోషిస్తుందని, కొందరి గుప్పిట్లో అధికారం ఉందని, కుటుంబ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలగాలన్నారు. తమ హయాంలోనే తెలంగాణ బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు. కేంద్రం సహకరించడం లేదన్న రాష్ట్ర ప్రభుత్వ అరోపణలను మోదీ ఖండించారు. అభివృద్ధి పనుల్లో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి రావట్లేదన్నారు. నవ భారతంలో నలుమూలల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నవభారతంలో దేశ ప్రజల కలలను నిజం చేయడమే తమ ధ్యేయమన్నారు. కుటుంబ పార్టీ, మామ, అల్లుడు, కూతురు, కొడుకు ఉన్న పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటోందన్నారు. కుటుంబ పార్టీ అవినీతికి కేరాఫ్‌గా మారిందని, కుటుంబ పార్టీలు అందరినీ తమ నియంత్రణలో ఉంచుకోవాలని చూస్తాయని విమర్శించారు. 2014 తర్వాత దేశానికి సంకెళ్ల నుంచి విముక్తి లభించిందన్నారు. తెలంగాణలో ఉన్నట్లుగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఉన్న కుటుంబ పార్టీలు సామాన్యుల రేషన్ కూడా దోచుకుంటున్నాయన్నారు. రాబోయే 25 ఏళ్లలో దేశంతో పాటు తెలంగాణకు మహర్దశ ఉంటుందని, తెలంగాణ ప్రజల కలల సాకారానికి కృషి చేస్తున్నామని మోదీ అన్నారు. తన మొత్తం ప్రసంగంలో అధికార పార్టీ పేరు ఎత్తకుండా, ఎవరి పేరును ప్రస్తావించకుండా రాష్ట్రంలోని అధికార పార్టీని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి, గవర్నర్ తమిళిసై, తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీలు, ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కరోనాతో ఒకరి మృతి

విశాలాంధ్ర-కుక్కునూరు: ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పేరాల శంఖు(62) కరోనాతో మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడ నుంచి స్థానిక ఆస్పత్రికి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే కుక్కునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది మృతుడు ఇంటికి వెళ్లి మిగిలిన కుటుంబ సభ్యులకు కరోనా పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్ వచ్చినట్టు వైద్యాధికారి సీహెచ్ పూర్ణ శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ అధికారులకు సూచించారు

రాష్ట్రానికి పట్టిన దరిద్రం జగన్: టీడీపీ నేత అనిత

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ విరుచుకుపడ్డారు. జగన్‌ను జాదూ ముఖ్యమంత్రి అని, రాష్ట్రానికి పట్టిన దరిద్రమని ఆరోపించారు. జగన్‌ను జాదూ సీఎం అంటూ శనివారం ఇక్కడ పోస్టర్ విడుదల చేశారు. విశాఖ టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో అనిత మాట్లాడుతూ వైసీపీ భజనబృందం వీధుల్లో సంచులు వేసుకొని తిరుగుతోందని, సంచుల్లో ఉన్న స్టిక్కర్ తీసి ప్రతి ఇంటికీ వాళ్లే అంటించుకుంటున్నారని విమర్శించారు. జగనే మా భవిష్యత్తు అని ప్రజలు చెప్పుకోవాలి కానీ స్టిక్కర్లు అంటించుకోవడమేమిటని ప్రశ్నించారు. జగన్...రాజశేఖర్‌రెడ్డి కొడుకు కాకపోతే ఆయన జీరో అని వ్యాఖ్యానించారు. సొంత తల్లినే గౌరవించని వ్యక్తని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని ప్రగల్భాలు పలికిన జగన్... ఆరు నెలలకే భారీగా పెంచారని మండిపడ్డారు. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పిన సీఎం...నాలుగేళ్లయినా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. నాలుగు గోడల మధ్య వేసిన ఓటు తెలుసుకున్న జగన్...బాబాయి వివేకను చంపింది ఎవరో తెలుసుకోలేకపోయారా అని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎం కావడం ఖాయమని వంగలపూడి అనిత ఆశాభావం వ్యక్తం చేశారు.

పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమం పేరుతో డబ్బులు పంచడం కాదని, అభివృద్ధి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, దక్షిణ నియోజకవర్గం అధ్యక్షురాలు కేదారి లక్ష్మి, ఈతలపాక సుజాత, కురిమిల లీలావతి, గనగళ సత్యవతి, ఉమారాణి, తోట శ్రీదేవి, ఉమారాంబాయి, వెంకట లక్ష్మీ, సౌజన్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత

- రూ.35 వేల కోట్ల వ్యయం
- రాష్ట్ర విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

విశాలాంధ్ర-పత్తికొండ: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, గత మూడు సంవత్సరాల్లో విద్యారంగంపై రూ.35 వేల కోట్లు ఖర్చు చేసిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే సొంతం అని రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. శనివారం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్దికెర మండలం బురుజుల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, తుగ్గలి మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధిస్తున్నారా, విద్యార్థులతో క్లాస్ వర్క్ ఏ విధంగా చేయిస్తున్నారని పరిశీలించారు. విద్యార్థులు క్లాస్ వర్క్ చేయడం లేదని గుర్తించి ఆయన అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో క్లాస్ వర్క్ చేయించే బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందని హితవు పలికారు. ఉపాధ్యాయులు నిర్దేశిత సమయంలో పాఠాలను బోధించాలని సూచించారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యకు పునాది లాంటిదని, ఉపాధ్యాయులు విద్యార్థులను స్వంత పిల్లల్లా భావించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తరగతిలో నిర్వహించే పరీక్షల ఫలితాలను పిల్లల తల్లిదండ్రుల దృష్టికి తీసుకొని వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డీఈవో రంగారెడ్డిని ఆదేశించారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మద్దికెర మండలం బురుజుల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పిల్లలకు ఇస్తున్న రాగి జావను, చిక్కిలను, కోడి గుడ్లను పరిశీలించారు. పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్కడే ఉన్న విద్యార్థులకు రాగిజావ అందించి రుచి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అక్కడ కూడా విద్యార్థులు క్లాస్ వర్క్ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. విద్యార్థుల పుస్తకాల్లో క్లాస్ వర్క్ చేయకుండా ఖాళీగా ఉండటం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏ విధంగా పాఠాలు చెబుతున్నారు, ఏ విధంగా పిల్లలు క్లాస్ వర్క్ రాస్తున్నారా లేదా అని తనిఖీలు నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. తనిఖీలు చేస్తే ఇలా జరగదని, ఉపాధ్యాయులు బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు.

తుగ్గలి మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గణితం టీచర్ సెలవులో వెళ్లడం వల్ల ఆ పోస్టు ఖాళీ ఉందని తెలుసుకుని, అప్పటికప్పుడు గణితం టీచర్‌ను నియమించే విధంగా ప్రిన్సిపల్ సెక్రటరీ చర్యలు తీసుకున్నారు. అనంతరం పత్తికొండలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర పాఠశాల, తుగ్గలి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాన్సెప్ట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, డిఈవో రంగారెడ్డి, సర్వ శిక్షా అభియాన్ పీవో వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల కోసం బెంగాల్‌కు పోలీసులు

విశాలాంధ్ర- విజయవాడ(క్రైమ్): బంగారం చోరీ కేసులో పోలీసుల వైఖరిపై 'రేపు రా.. ఎల్లుండి రా..' శీర్షికతో విశాలాంధ్రలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బాధిత వ్యాపారికి శనివారం ఎస్‌ఐ ఫోన్‌చేశారు. నిందితుల కోసం పోలీసులతో కలిసి పశ్చిమబెంగాల్ వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని సూచించినట్లు సమాచారం. నిందితులకు సంబంధించిన ఆధార్ కార్డులను కూడా అడిగి తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు ప్రత్యేక విభాగం పోలీసు అధికారి కూడా బాధిత వ్యాపారిని కలిసి వివరాలు నమోదు చేసుకున్నట్లు సమాచారం.

విశాలాంధ్ర ఎఫెక్ట్

రూ.2500కు మొక్కజొన్న కొనుగోలు చేయాలి

జమలయ్య డిమాండ్

విశాలాంధ్ర-మైలవరం: మొక్కజొన్నలు క్వింటా రూ.2500లకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు రంగంలోకి దిగాలని విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆయన తెలిపారు. దళారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధరల కంటే తక్కువకు కొనుగోలు చేసి రైతుల కష్టాన్ని దోచుకుతింటున్నారని విమర్శించారు. వారం రోజుల క్రితం క్వింటా మొక్కజొన్న రూ.2400లకు కొన్నారని, ఇప్పుడు రూ.1900లకు పడిపోయిందని వివరించారు. దళారులు సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం బొర్రగూడెం, పుల్లూరు, చంద్రగూడెం, మైలవరం తదితర గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ప్రతినిధి బృందం శనివారం పర్యటించింది. మొక్కజొన్న రైతులను కలిసి మద్దతు ధరపై ఆరా తీసింది. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల రైతు రూ.10 వేల వరకు నష్టపోతున్నాడని జమలయ్య తెలిపారు. మైలవరం మార్కెట్ యార్డులో వ్యాపారులందరూ లైసెన్సు లేకుండా మొక్కజొన్న పంట కొనుగోలు చేస్తున్నారని, కనీస మద్దత ధర కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని... క్వింటా రూ.2500కు కొనుగోలు చేయాలని కోరారు. మార్కెట్ యార్డుల్లో లైసెన్స్ లేని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మార్కెట్ యార్డు కమిషనర్, వ్యవసాయ శాఖ కమిషనర్, వ్యవసాయశాఖ మంత్రి కాకని గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని రైతులకు హామీ ఇచ్చారు. బృందంలో సీపీఐ మైలవరం మండల కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు, నాయకులు కాళింగి కొండలు, వంశీ కృష్ణ, కాళింగి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రచయితల వర్క్‌షాప్‌కు పాటలు, నాటికలు పంపండి

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి

విశాలాంధ్ర - తిరుపతి: ఈ నెల 10, 11, 12 తేదీల్లో తెనాలిలో జరిగే రచయితల, కళాకారుల వర్క్ షాప్‌కు యువ కవులు, రచయితలు, కళాకారులు తమ రచనలతో హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య కోరారు. తిరుపతి బైరాగి పట్టెడలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో రాజకీయ, సాంస్కృతిక సంస్థలపై జరుగుతున్న విధ్వంసం, పాలకుల మోసపూరిత విధానాలను ఇతి వృత్తంగా రచయితలు తమ కలాలకు పదును పెట్టాలని కోరారు. ప్రధానంగా పాటలు, నాటికలు, నాటకాలు, స్కిట్స్ రూపంలో రచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలు, ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మడం, దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడం తదితర అనేక అంశాలను ఇతివృత్తంగా చేసుకొని రచయితలు సూటిగా పాలకుల దుర్నీతిపై స్పందించాలన్నారు. తెనాలిలో జరిగే వర్క్ షాప్‌కు స్వయంగా రావటం గాని, లేదా సెల్ నంబర్ 9885228869, 9866288553కు వాట్సాప్‌లో పంపాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులు మారేళ్ల శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కార్యదర్శి జింకా నాగరాజు, కోశాధికారి బి.నాగభూషణం, ఆర్.బలరాం, మహిళా కళాకారులు ప్రమీల, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థల విధ్వంసం: దేగా ప్రభాకర్

విశాలాంధ్ర-అమలాపురం: రాజ్యాంగ వ్యవస్థలను మోదీ సర్కారు ధ్వంసం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ విమర్శించారు. దేశాన్ని ఫ్యూడల్ వ్యవస్థ దిశగా తీసుకెళుతోందని మండిపడ్డారు. సీపీఐ అమలాపురం నియోజకవర్గ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అడపా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. దేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయాలతో మోదీ సర్కారు దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి తీసుకెళ్లిందని విమర్శించారు. పార్లమెంటుకు కూడా జవాబుదారీగా ఉండటం లేదన్నారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న విపక్షాలపై ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తోందన్నారు. అదానీ అక్రమాలపై జేపీసీ ఏర్పాటుకు ఎందుకు భయపడుతోందని ప్రభాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయడం మోదీ నియంతృత్వ విధానాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. బీజేపీ విధానాలు ఎండగడుతూ ఉభయ కమ్యూనిస్టులు పార్టీలు ఈ నెల 14 నుంచి చేపట్టిన బీజేపీ హటావో...భారత్ బచావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి సత్తిబాబు మాట్లాడుతూ కేంద్ర విధానాలపై ప్రచారభేరికి సంబంధించి సీపీఐ, సీపీఎం సమావేశమై...కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. 11 వ తేదీన చలో విజయవాడను జయప్రదం చేయడంతో పాటు అనేక తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ

వాకపల్లి ఘటనపై జేవీఎస్ఎన్ మూర్తి డిమాండ్

విశాలాంధ్ర-పాయకరావుపేట(అనకాపల్లి జిల్లా): వాకపల్లి ఘటనలో గిరిజన మహిళలకు జరిగిన అన్యాయంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, నిందితులకు శిక్ష పడేలా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. పాయకరావుపేటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన మహిళలపై అత్యాచారం కేసులో 17 ఏళ్ల తర్వాత తీర్పు వచ్చిందన్నారు. ఈ కేసులో పోలీసులే నిందితులని, ఆ కేసును దర్యాప్తు చేసిన అధికారులూ పోలీసులేనని, అందుకే పోలీసు శాఖను కాపాడుకునేందుకు దర్యాప్తు అధికారులు పక్షపాత ధోరణితో విచారణ చేశారని గుర్తుచేశారు. కేసు విచారణ సమయంలో మేజిస్ట్రేట్ చేసిన వ్యాఖ్యలు పోలీసు వ్యవస్థ తీరును బహిర్గతం చేశాయన్నారు. పోలీసులే సాక్ష్యాలు ధ్వంసం చేశారని, సరైన సాక్ష్యాలు లేకపోవడంతోనే కేసును కొట్టివేస్తున్నామని మేజిస్ట్రేట్ పేర్కొన్నారని తెలిపారు. అయితే, బాధిత మహిళలకు నష్టపరిహారం ఇవ్వాలని కోర్టు స్పష్టమైన తీర్పు చెప్పిందన్నారు. గిరిజన మహిళలపై అత్యాచారం జరగటం వాస్తవమని, దోషులు ఎవరు...వారికి శిక్షలేవని సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. అత్యాచారాలు, హత్యలు చేసి పరిహారం ఇస్తే బాధితులకు న్యాయం జరిగినట్లేనా అని ఆయన నిలదీశారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే...తమకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వమని చెప్పు కోవడం నిజమే అయితే...అత్యాచారానికి గురైన వాకపల్లి గిరిజన మహిళలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే బాధితుల తరుపున కోర్టులో అప్పీలుకు వెళ్లాలని సూచించారు. జైళ్లలో కేసులు పరిష్కారం కాకుండా 85 శాతం మంది దళితులు, గిరిజనులే ఉంటున్నారని సత్యనారాయణమూర్తి తెలిపారు.

దళితులు, ముస్లింలపై దాడులు ప్రతిఘటిద్దాం

ఈశ్వరయ్య, ప్రభాకర్ పిలుపు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: దళితులు, ముస్లింలపై జరుగుతున్న హత్యలు, పైశాచిక దాడులను ఐక్యంగా ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ పిలుపునిచ్చారు. విజయనగరంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ, డీహెచ్‌పీఎస్, ఇన్సాఫ్ అధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ విజయనగరం జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షత వహించారు. ఈశ్వరయ్య, ప్రభాకర్ మాట్లాడుతూ దళితుల, ముస్లింలపై యధేచ్ఛగా దాడులు జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పాలకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని డాక్టర్ సుధాకర్ ఉదంతాన్ని గుర్తు చేశారు. కడప జిల్లాలో ఏకంగా మరో డాక్టర్ అచ్చెన్నను చంపేశారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు ఏకంగా తన డ్రైవర్‌ను చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశారన్నారు. ఈ ఘటనలపై ముఖ్యమంత్రి జగన్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కానీ తమ్ముడు అవినాశ్‌రెడ్డికి కష్టం రాగానే హుటాహుటిన ఢిల్లీకి పరుగులు తీశారని ఆరోపించారు. వైసీపీని దళిత వ్యతిరేక పార్టీగా అభివర్ణించారు. దళితులపై దాడులకు సంబంధించి జాతీయ, రాష్ట్ర ఎస్సీ కమిషన్‌లు కనీసం స్పందించకపోడం శోచనీయమని ఈశ్వరయ్య, ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నిధులు పక్కదారి పడుతున్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక దళిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయన్నారు. ఈనెల 11న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని దళితులు, మైనారిటీలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సురగడ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఓట్ల కోసమే దళితులను వాడుకుంటున్నారన్నారు. ముస్లిం జమాత్ కమిటీ నాయకులు రహమతుల్లా, కరీంభాయ్ మాట్లాడుతూ దళితులు, మైనార్టీలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆప్ నియోజకవర్గ కన్వీనర్ తిప్పన కోటేశ్వరరావు, లోక్‌సత్తా పార్టీ నాయకులు రాజారావు మాట్లాడుతూ దాడికి ప్రతిదాడి జరిగినప్పుడే దళిత, మైనార్టీల జోలికి ఎవరూ రారన్నారు. జమాతా ఇస్లామిక్ జిల్లా అధ్యక్షులు షేక్ సయ్యద్, జిల్లా అభివృద్ధి వేదిక నాయకులు పుక్కెళ్ల షణ్ముఖరావు, తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ నాయకులు షేక్ పీర్, ప్రొఫెసర్ అంబేడ్కర్ అశోక్ మాట్లాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగారాజు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోకా రమేశ్‌బాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు బాయి రమణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగభూషణం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, డీహెచ్‌పీఎస్ మన్యం జిల్లా కార్యదర్శి గుజ్జు జనార్దన్, నాయకులు రెగేటి సంతోశ్, శివకృష్ణ, దళిత, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మోదీని గద్దె దింపుదాం

సీపీఐ శ్రేణులకు అక్కినేని వనజ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వినాశకర విధానాలపై పోరాటానికి ప్రజల మద్దతు కూడగట్టడానికి ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రచార జాతా విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో శనివారం సీపీఐ జిల్లా కార్య వర్గం, సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారం చేపట్టిన తర్వాత ఆయన దత్తపు త్రులు అదానీ, అంబానీలకు ప్రభుత్వరంగ సంస్థ లను కారు చౌకగా కట్టబెడుతున్నారని విమర్శిం చారు. అదానీ వ్యవహారంలో 19 ప్రతిపక్ష పార్టీలు జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తే వేసేందుకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. వేల కోట్లు దోచుకుని విదేశాలకు పారిపోయిన పారిశ్రామికవేత్తలందరూ గుజరాతీయులేనని, వారికి మోదీ సర్కారు అండగా నిలుస్తోందని విమర్శిం చారు. విద్యా వ్యవస్థలో మత బీజం నాటే ప్రయత్నాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాను అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా, వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాయలసీమకు నిధులు, కడప ఉక్కు సాధిస్తానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టిన తర్వాత కేసులకు భయపడి రాష్ట్ర ప్రయో జనాలను మోదీ పాదాల వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలకు, రాష్ట్రంలో ముఖ్య మంత్రి జగన్ అరాచకాలను వ్యతిరేకిస్తూ చేసే ప్రచార జాతాలు, ఈనెల 11వ తేదీన దళిత ప్రజా సంఘాలు, వామపక్షాల ఆధ్వ ర్యంలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్ర మాన్ని విజయవంతం చేయడానికి సీపీఐ శ్రేణులు సిద్ధంగా ఉండాలని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమి షన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఇటీవల కాలంలో మరణించిన సీపీఐ నాయకులు, సానుభూతి పరులకు సంతాపం తెలుపుతూ తీర్మానం ప్రవేశ పెట్టారు. ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు.

దాడులు ఐక్యంగా ఎదుర్కొందాం

- దళితులు, మైనారిటీల హక్కులకు రక్షణ కల్పించాలి
- గుంటూరు రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు



విశాలాంధ్ర-గుంటూరు: దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించేందుకు ఐక్యపోరాటాలు అవశ్యమని రౌండ్ టేబుల్ సమావేశం స్పష్టంచేసింది. దళితులు, మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఐక్యతతో సాధించుకుందామని పిలుపు నిచ్చింది. దళితులు, మైనారిటీల ఓట్లతో గద్దెనెక్కిన వైసీపీ...వారి హక్కుల పరి రక్షణ, సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించడంలో విఫలమైందని విమర్శిం చింది. దళితులు, మైనారిటీలపై దాడులు, అకృత్యాలను నిరసిస్తూ దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్), ఇన్సాఫ్ జిల్లా సమితి అధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఇన్సాఫ్ జిల్లా నాయకులు నాగూల్ మీరావలి అధ్యక్షత వహించిన సమా వేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి మానుకొండ శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తదితరులు మాట్లాడారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత బడుగు, బలహీనవర్గాలు అధికంగా నష్టపోయా యని నాయకులు చెప్పారు. రాజ్యాంగా నికి తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులు, మైనారిటీలను రాజకీయంగా, ఆర్థికంగా వెనక్కి నెడుతున్నారని, వారిపై దాడులకు పాల్పడిన వారికే పదవులు కట్టబెడుతు న్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లిస్తున్నారని, పేరుకే కార్పొరేషన్లు తప్ప వాటికి ఒక్క రూపాయి నిధులు లేవని చెప్పారు. ఎస్సీలపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై సీఎం జగన్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్య క్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, నగర కార్యదర్శి బండారపు యశ్వంత్ శశి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొట్ల బ్రహ్మయ్య, దళిత మహాసభ నాయకులు వై.సాంబశివ రావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, బీఎస్పీ నాయకులు వాసు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, జనసేవాదళ్ నాయకులు నూతలపాటి చిన్న ప్రసంగించారు. మహిళా సమాఖ్య నాయకుకులు రెంటాల కుమారి, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అదానీపై పవార్ ప్రేమలో ఆంతర్యం ఏమిటో!

రాజకీయ నాయకులకు వ్యాపారవేత్తలతో సంబంధాలు ఉండడం పరిపాటే. కానీ కళంకితుడైన గౌతం అదానీని శరద్ పవార్ సమర్థించడం కేవలం ఆయన వ్యక్తిగత వ్యవహారమో లేదా కేవలం ఆయన నాయకత్వంలోని నేషనలిస్టు పార్టీకి పరిమితమైన విషయమో కాదు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న శరద్ పవార్ హఠాత్తుగా అదానీ మీద ఉద్దేశ పూర్వకంగా దాడి చేస్తున్నారని ఆరోపించడం వైపరీత్యమే. అయితే పవార్ కు ఇలా హఠాత్తుగా దారి మార్చే అలవాటు ఇప్పటిది కాదు. ఇది ఆయన రాజకీయ చతురతలో భాగం. 2004లో సోనియా గాంధీని ప్రధానమంత్రిని చేయాలనుకున్నప్పుడు ఆమె విదేశీ మహిళ కనక భారత ప్రధానమంత్రి పదవికి అర్హురాలు కాదు అన్న దుమారం రేగింది. ఆ కారణంగానే శరద్ పవార్, పి.ఎ.సంగ్మ లాంటి వారు కాంగ్రెస్ కు రాజీనామా చేసి నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేశారు. అయినా కొంత కాలానికే పవార్ కాంగ్రెస్ కు సన్నిహితంగా మెదలడం ప్రారంభించారు. కాంగ్రెస్ తో కలిసి పని చేయడం ఆయనకు అప్పుడు ఏ రకంగానూ అభ్యంతరకరం కాలేదు. అదానీకి మోసపూరిత వ్యాపార పద్ధతులను గట్టిగా వ్యతిరేకించిన ప్రతిపక్ష పార్టీలలో పవార్ నాయకత్వంలోని ఎన్.సి.పి. భాగస్వామ్యం కూడా ఉంది. కానీ అదానీ మీద దాడి చేయడం ఆపాలని మిగతా ప్రతిపక్షాలను ఆయన కోరారు. ప్రతిపక్షాలు పార్లమెంటులోనూ, వెలుపలా అదానీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తూనే ఉన్నాయి. హిండెన్ బర్గ్ గురించి తెలియదంటూనే ఆ సంస్థ వెలువరించిన నివేదిక అదానీని అపఖ్యాతిపాలు చేయడానికే ఉద్దేశించిందని పవార్ ఎలా చెప్పగలరో! శరద్ పవార్ అదానీని వెనకేసుకు రావడంవల్ల బడా వ్యాపార వేత్తలతో ఆయన స్నేహం ఒక్కటే కారణం అనీ చెప్పలేం. 2024 ఎన్నికలలో ప్రతిపక్షాలన్నీ ఏకమై మోదీని గద్దె దించాలన్న ప్రయత్నాలకు పవార్ వైఖరి కచ్చితంగా అనుమానాలు రేకెత్తిస్తుంది. ఇటీవల కొన్ని ప్రతిపక్ష కార్యకలాపాలకు పవార్ పార్టీ దూరంగా ఉండడం గమనించే వారికి పవార్ అడుగులు ఎటు పడ్తున్నాయో అవగాహన అయ్యే ఉంటుంది.

అదానీ వ్యవహారంపై అవసరానికి మించి ప్రతిపక్షాలు యాగీ చేశాయని ఎన్.డి.టి.వీ.కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఆయన ఇంటర్వ్యూ ఇచ్చిన చానల్ అదానీ అధ్వర్యంలోనే నడుస్తోంది. పార్లమెంటు సమావేశాలు ముగిసిన రోజే పవార్ ఇంటర్వ్యూ ప్రసారం కావడమూ అనుమానాలకు తావిస్తోంది. పార్లమెంటులో ప్రతిపక్షాలు అదానీకి వ్యతిరేకంగా పట్టువిడుపులు లేని వైఖరి అనుసరించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. అదానీ గురించి ఆందోళన చేయడమూ ఆయనకు నచ్చినట్టు లేదు. ప్రతిపక్షాలు అవసరానికి మించి అదానీ మీద దాడి చేశాయని ఆయన అభిప్రాయం. పార్లమెంటు కార్యకలాపాలకు ఇదివరకు కూడా అంతరాయం కలిగింది కానీ ఈ సారి అది శ్రుతి మించిందని పవార్ అంటున్నారు. అంటే అదానీ అడ్డగోలు వ్యాపార పద్ధతులపై, అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించడానికి ప్రధానమంత్రితో ఉన్న సంబంధమే కారణం అన్న వాదనను కూడా పవార్ ఇప్పుడు అంగీకరిస్తున్నట్టు లేదు. అదానీ బండారం బయట పెట్టిన హిం డెన్ బర్గ్ సంస్థకు ఉన్న విశ్వసనీయతపై కూడా పవార్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఒక వేళ అదానీ పొరపాటు చేస్తే దర్యాప్తు జరగాల్సిందేనని అదే నోటితో పవార్ అన్నారు. అదానీ వ్యవహారం బయటపడ్డప్పటి నుంచి ప్రతిపక్షాలు ముక్త కంఠంతో కోరుతున్నది అదానీ కార్యకలాపాలపై దర్యాప్తు జరగాలనేగా. అంటే ఈ అంశంపై కూడా పవార్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నట్టుంది. అదానీ వ్యవహారాన్ని పరిశీలించడానికి సుప్రీంకోర్టు కమిటీ ఏర్పాటు చేసిన తరవాత సం యుక్త పార్లమెంటరీ కమిటీ అవసరం ఏమిటి అని కూడా ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇంతకు ముందు టాటా, బిర్లా మీద దాడులు జరిగేవనీ ఇప్పుడు అదానీ, అంబానీ మీద ప్రతిపక్షాలు గురి పెట్టాయన్నది ఆయన భావన. ఎన్.డి.టీ.వీ.కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కాంగ్రెస్ పేరుగానీ, మరే రాజకీయ పార్టీ పేరుగానీ ఎత్తలేదు. పవార్ ఇలాంటి ఇంటర్వ్యూ ఇవ్వవలసిన అగత్యం ఉందా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. అదానీ వ్యవహారంలో పవార్ అభిప్రాయం భిన్నమైంది కావచ్చు కానీ దీనివల్ల ప్రతిపక్ష ఐక్యతా యత్నాలకు విఘాతం ఏమీ ఉండకపోవచ్చు అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జై రాం రమేశ్ అన్నారు. ఒక వేళ భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడమే పవార్ లక్ష్యం అయి ఉంటే అదానీకి చెందిన ఎన్.డి.టీ.వీ. కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చి ఉండే వారు కాదు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు జరుగుతున్న దర్యాప్తు బ్రహ్మాండం బద్దలయ్యే అంశాలు బయట పెడ్తుందన్న ఆశ ఎవరికీ లేదు. ఇలాంటి విషయాలలో ప్రభుత్వ సహకారం నామ మాత్రంగా కూడా ఉండదు. పెగాసస్ విషయంలో ఇలాగే జరిగింది. ప్రభుత్వం ఎంత మాత్రం సహకరించలేదని సాక్షాత్తు సుప్రీంకోర్టే తెలియజేసింది.

విచిత్రం ఏమిటంటే చట్టసభల సభ్యుడిగా 66 ఏళ్ల అనుభవం ఉన్న శరద్ పవార్ సంయుక్త పార్లమెంటరీ కమిటీ ప్రయోజనాన్నే తోసిపుచ్చేట్టు మాట్లాడుతున్నారు. అదానీ వ్యవహారం సామాన్య మానవులకు పట్టదని కూడా ఆయన అంటున్నారు. ఇదే మాట ప్రతిపక్షాల సమావేశాల్లో పాల్గొన్నప్పుడు పవార్ చెప్పి ఉండొచ్చు. బహిరంగంగా ఇంటర్వ్యూలో చెప్పడం ఆయన అసలు ఉద్దేశాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. పవార్ వైఖరి ప్రతిపక్షాలు లేవనెత్తిన అసలు సమస్యను తుస్సుమనిపించేదిగా ఉంది. ఇదీ ఆయన ఉద్దేశంపై ప్రశ్నలు లేవనెత్తక తప్పదు. పవార్ రాజకీయ వైఖరిలో మార్పు వస్తుందా లేదా ఇప్పుడే చెప్పలేక పోవచ్చు. జె.పి.సి. దర్యాప్తువల్ల ఉపయోగం పరిమితమైందే అయినా, ఆ దర్యాప్తు తరవాత ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎవరినీ శిక్షించే అవకాశం లేకపోయినా ఎవరినైనా పిలిపించి ప్రశ్నించే హక్కు, ఏ దస్తావేజునైనా పరిశీలించే హక్కు జె.పి.సి.కి ఉంటుందని పవార్ కు తెలియక కాదు. సుప్రీంకోర్టు ఆదేశించిన దర్యాప్తు అదానీ వ్యవహారంలో కీలకాంశం అయిన అదానీ–మోదీ–మధ్య సంబంధాలను బయట పెట్టలేదు. ఆ విషయం బయట పెట్టే అవకాశం జె.పి.సి. దర్యాప్తుకు ఉండేది. పవార్‌కు పారిశ్రామిక వేత్తలతో సాన్నిహిత్యం ఉండొచ్చు. కానీ ఆయన మాటలు ప్రతిపక్షాలు ఉమ్మడిగా లేవనెత్తుతున్న అదానీ వ్యవహారాన్ని నీరుగార్చేలా ఉన్నాయి. అంతిమంగా పవార్ ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా మసలు కుంటారని చెప్పలేం. కానీ తనకు సాన్నిహిత్యం ఉన్న పారిశ్రామిక వేత్తలను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారని స్పష్టం అవుతూనే ఉంది.

యువభారతం నైపుణ్యాల నెలవు కావాలి..!

"నైపుణ్యాలను సరైనధరకు అమ్ముకోవాలేకాని, ఆత్మను అంతరాత్మను ఎన్నటికీ అమ్ముకోరాదని" నాటి అమెరికా అధ్యక్షులు అబ్రహం లింకన్ పేర్కొనడం మనకు తెలుసు. దీనిని మనందరం గుర్తుంచుకోవాలి. జీవితానికి గుర్తింపునిచ్చేది విజ్ఞాన వివేకాలయితే, జీతానికి మూలం ఉద్యోగ సాధన, నైపుణ్యాలు అవుతాయి. మన పరిజ్ఞానం, ప్రతిభను బట్టి మాత్రమే వార్షిక వేతనముతో పాటు ఉద్యోగ హోదా ఆధారపడి ఉంటాయి. నైపుణ్య సంపద గల వారి వెంట ధనం, గౌరవం,హోదా వస్తాయి.

విద్యార్హతలు ఉన్నప్పటికీ ఉద్యోగ సాధనకు గట్టి పోటీ ఉంటుందని మనకు తెలుసు. వ్యక్తిగత, శాస్త్రసాంకేతిక నైపుణ్యాలు మాత్రమే ఉద్యోగంలో ఎంపికకు, ఎదుగుదలకు ఉపయోగపడతాయి. నిరంతరం నైపుణ్యాలను సానబెట్టుకుంటూ ముందుకు సాగాలి. గెలవాలనే ప్రగాఢ వాంఛలోంచి విజయ ప్రస్థానం ప్రారంభమవుతుంది. ప్రతిరోజు కొత్తదనాన్ని కోరుకోవాలి. నేటి ప్రయత్నం విఫలమైనా, అది రేపటి గెలుపుకు పునాది అవుతుందని గుర్తుంచుకోవాలి. నైపుణ్యాల్లో నిష్ణాతులయిన వారందరిలో ఆత్మవిశ్వాస నిధి కనిపిస్తుంది. ప్రతి అడుగు, మాట, చేతలో ఆత్మవిశ్వాసం ఉట్టిపడుతుంది. విజేతలందరిలో అంతర్గత, బాహ్య లక్షణాలు విలక్షణంగా ఉంటాయి. ఆత్మసంతృప్తి, సఫలీకృత భావం, అర్థవంత భావన, మనశ్శాంతి, ఆనందం, భద్రత, ఆత్మవిశ్వాసం లాంటివి అంతర్గత గుర్తింపులు అవుతాయి.

వృత్తిఉద్యోగాల్లో రాణించటానికి 90శాతం నమ్మకమైన విధి నిర్వహణ, 10శాతం సంభాషణా చతురత ఉపయోగపడతాయి. ఉద్యోగంలో రాణించ టానికి పనిపై అంకితభావం, లక్ష్యంపైగురి, అవసరనైపుణ్యాలు, మానవీయ సంబంధాలు, తెలుసుకోవాలనే తపన, గౌరవాన్ని ఇచ్చి పుచ్చుకోవటం, నమ్మకాన్ని చూరగొవడం, సమస్యకు పరిష్కారం వెతకటం, ప్రతిబంధకా లను అధిగమించటం, ప్రేరణాత్మకంగా ఉండటం, వ్యతిరేక భావాలను గౌరవించి ఒప్పించటం, వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకోవటం, సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఎదగటం, తరాల మధ్య అంతరాన్ని గమనించటం, మన దృక్పథమే మన విజయాన్ని నిర్ణయిస్తుందని నమ్మటం లాంటి అంశాలు దోహదపడతాయి.

ఒక చిన్న సంఘటనను గమనిద్దాం. ఇద్దరు యువకులను పిలిచిన యజమాని వారికి కొన్ని పుస్తకాలను ఇస్తూ ఒక గ్రామంలో అమ్మమని పంపిస్తాడు. మొదటి యువకుడు గ్రామాన్ని కలియ తిరిగి గ్రామస్థు లందరూ నిరక్షరాస్యులని గమనిస్తాడు. వెంటనే తన యజమానికి ఫోన్‌చేసి ఈ గ్రామస్థులు నిరక్షరాస్యులని, పుస్తకాలమ్మటం అసాధ్యమంటాడు. రెండవ యువకుడు ఈ గ్రామాన్ని సందర్శించి ఆనందంతో యజమానికి ఫోన్ చేసి ఈ గ్రామంలో పుస్తకాలకు రాబోయే రోజుల్లో మంచి మార్కెట్ ఉంటుందని అంటాడు. గ్రామస్థులందరినీ అక్షరాస్యులను చేస్తూ, చదువుకోవాలనే వాంఛను రగిలించుట ద్వారా పుస్తకాలను విక్రయించ వచ్చని అంటాడు. ఒకే సందర్భానికి ఇద్దరి స్పందన విభిన్నంగా ఉంది. మనం రెండవ వ్యక్తిలా ఆలోచించటం అలవర్చుకోవాలి. గెలుపు, ఓటములను నిర్ణయించే అంశాలుగా మానసిక ధృక్పథం, లక్ష్య ఛేదనలో స్పష్టతతోపాటు ప్రగాఢ ఆశయ సాధనా వాంఛ, కలల్ని సాకారం చేసుకునే ప్రయత్నాలు పేర్కొనవచ్చు. ఒలంపిక్ పతక విజేతల వెనక రెండు దశాబ్దాల కఠోర శ్రమ దాగి ఉంటుంది. వంద మీటర్ల పరుగు పందెంలో ఒక్క క్షణమే గెలుపోటములను నిర్ణయిస్తుంది. ఒక్క అడుగు ముందు వేయటానికి ఇరవయ్యేళ్ల అభ్యాసం దోహదపడుతుందని మరువ రాదు. ఏ పనిని ఎప్పుడు, ఎందుకు, ఎలా చేయాలో తెలిసి క్రమశిక్షణతో శ్రమించే జీవన విధానాన్ని అలవర్చుకోవాలి.

నైపుణ్యాలు నేర్చుకోవటం ఈత నేర్చుకోవటం లాంటిది. నైపుణ్యాలను తెలుసుకుంటూనే ప్రయోగాత్మక అనుభవాన్ని పొందాలి. ఎలా చేయాలో నేర్పేది ప్రతిభ. ఎందుకు చేయాలో సూచించేది ప్రేరణ అవుతుంది. ఎంత బాగా చేయాలో తెలిపేది దృక్పథం అవుతుంది. విసుగును దరిరానివ్వక నవ్వుతూ పోరాడి గెలుచుటే ఉత్తమ వ్యక్తిత్వం. వైఫల్యాలను దాటుతూ విజయతీరాలు చేరుటలో జీవన విలువలు, ఆశావహ దృక్పథం, ప్రగాఢ వాంఛ, గమ్యంపై స్పష్టతలు దోహదపడతాయని గమనించాలి. శ్రమ పడకుండా ఫలితాన్ని ఆశించరాదు.

మధుపాళి, సెల్:9949700037

ప్రబలిన నిరుద్యోగం

డా. జ్ఞాన్‌పాఠక్

భారతదేశంలో నిరుద్యోగం ప్రబలిపోతోంది. అయినప్పటికీ బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నామని ప్రచారం చేస్తోంది. 2023 మార్చితో ముగిసిన మూడు నెలలకాలంలో నిరుద్యోగం రేటు జనవరిలో 7.14శాతం కాగా, అది మార్చినాటికి 7.8శాతానికి పెరిగింది. ఈ మూడునెలల్లోనే 26లక్షల మంది ఉద్యోగాలు ఊడాయి. రానున్న రోజుల్లో మరికొన్ని లక్షలమంది ఉద్యోగాలు ఊడేప్రమాదం పొంచిఉంది. పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు సైతం వేలాదిమందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఒక్క మార్చిలోనే 22.7లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. కార్మిక మార్కెట్‌లో క్షేత్రస్థాయి పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉంది. ఇటీవల రిజర్వు బ్యాంకు విడుదల చేసిన వినిమయదారుల విశ్వాసం సర్వే వాస్తవాలకు భిన్నంగా ఉంది. ఉద్యోగ మార్కెట్‌లో పరిస్థితి 2019 మధ్య కాలంలో ఉన్న పరిస్థితిని గుర్తు చేస్తోంది. ఆనాడు నిరుద్యోగం రేటు ఎక్కువగా నమోదైంది. రానున్న సంవత్సరంలో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వినిమయదారులు ఆశిస్తున్నారు. అయితే కోవిడ్‌కేసులు తిరిగి పెరుగుతున్న తరుణంలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది ఇంకా నిర్దిష్టమైన అంచనాకు వచ్చే అవకాశంలేదు. ఆర్‌బీఐ సర్వే పూర్తి అవాస్తవమని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి (సీఎమ్ఐఇ-భారత ఆర్థికవ్యవస్థ పరిశీలనా కేంద్రం) తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. 2022 డిసెంబరులో కార్మికులు 40.5శాతం పనులు చేస్తుండగా అది 2023 మార్చి నాటికి 39.8శాతానికి తగ్గింది. ఎందుకంటే కార్మిక మార్కెట్‌లో డిమాండు తగ్గింది.

అలాగే 2022 డిసెంబరులో ఉద్యోగిత రేటు 37.1శాతం నమోదుకాగా 2023 మార్చినాటికి 36.7శాతానికి తగ్గింది. అంటే ఈ కాలంలో 26లక్షల మందికిపైగా ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగాల ఊడిపోయాయి. ఒక్క మార్చిలోనే మార్కెట్‌లో మాంద్యం ఏర్పడి 22.7లక్షల మంది ఉద్యోగాలు, పనులుకోల్పోయారు. మార్కెట్‌లో ఉన్న ఆందోళనకరమైన పరిస్థితిని ఈ సంఖ్య తెలియజేస్తోంది. ఒక్కనెలలోనే లక్షల ఉద్యోగాలు కోల్పోవడం కార్మిక మార్కెట్‌లోఉన్న తీవ్ర ఒడిదుడుకులను తెలియజేస్తున్నది. ఉద్యోగాలు కోల్పోయినవారు తక్కువ నాణ్యత, వేతనాలు ఉండే పనులలోనైనా సర్దుబాటు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. నిర్మాణరంగంలో పని చేస్తున్న కార్మికులు అత్యధికంగా పనులు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు. నిర్మాణరంగంలో ఫిబ్రవరి నెలలో 723.4లక్షల మందికి పనులు లభించగా, మార్చిలో ఇవి 627.6లక్షల కోట్లు తగ్గిపోయాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఆర్‌బీఐ వాస్తవ అంశాలను మరుగున పరచి మోదీ ప్రభుత్వానికి సహకారంగా ఉంటుందన్న భావన కలుగుతోంది. కోవిడ్ మహమ్మారి రెండవదశలో విజృంభించింది. 2021మే నెల నాటి నుంచి నిర్మాణరంగం అలాగే వివిధ పరిశ్రమలలో ఉద్యోగులు, కార్మికులస్థితి అత్యంత దారుణంగాఉంది. ఆ సమయంలో ఒక్క నిర్మాణరంగంలోనే 116లక్షలమంది కార్మికులు పనులు లేక అల్లాడిపోయారు.

కరోనా రెండవ దశలోనే చిల్లర వాణిజ్యం అధ్వాన్న పరిస్థితిని ఎదుర్కొంది. ఈ రంగంలో పనిచేసేవారు కనీసం 80లక్షలమంది పనులు కోల్పోయారు. 2021 మే నెల నుంచి ఇదే అత్యంత దారుణమైన పరిస్థితిగా విశ్లేషించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చిల్లరవ్యాపారంలో 757.5 లక్షల మంది పనిచేస్తుండగా, ఈ సంఖ్య మార్చిలో 676.5లక్షలకు పడిపోయింది. వ్యవసాయేతర రంగాలలో పరిస్థితి అత్యంత నిరాశాజనకంగా ఉందని అందరికీ తెలిసిందే. 2023 జనవరి నాటినుంచే పట్టణప్రాంతాల్లో నిరుద్యోగం గ్రామీణ ప్రాంతాలలో కంటే ఎక్కువగాఉంది. పట్టణాలు, నగరాలలో వ్యవసాయేతర రంగంలో ఎక్కువమంది కార్మికులు తమ పనులు కోల్పోయారు. ఫలితంగా మార్చిలో వ్యవసాయ రంగంలోకి ఎక్కువమంది కార్మికులు ప్రవేశించారు. ఈ విధంగా వ్యవసాయేతర రంగాలలో పనులు కోల్పోయినవారికి వ్యవసాయరంగంలో ఉపాధి లభించింది. అయినప్పటికీ వ్యవసాయరంగాన్ని ప్రయోజనకరంగా, రైతులకు లాభసాటిగా తయారు చేసేందుకు బదులుగా కేంద్ర ప్రభుత్వం దీన్ని మరింత దిగజార్చేందుకు ప్రయత్నించడం శోచనీయం.

వారానికి ఒకరోజు పని దొరికేవారిని కూడా ఉపాధి పొందుతున్నవారిగా ప్రభుత్వం అంచనావేయడం మరింత దారుణం. అందువల్ల ఆర్‌బీఐ సర్వే వాస్తవాలను ప్రతిబింబించదు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకంలోనే ఎక్కువమంది కార్మికులు పనిచేసేందుకు సిద్ధపడవలసి వచ్చింది. అయితే ఈ పథకానికి కేటాయించే నిధులను కేంద్ర ప్రభుత్వం ప్రతిసంవత్సరం తగ్గిస్తోంది. మొదట ఈ పథకాన్ని క్రమంగా రద్దు చేయాలన్న ఆలోచనలోనే ఈ ప్రభుత్వం ఉండింది. ఆ తరువాత నిధులను తగ్గిస్తూ వస్తోంది.

అయితే ఆకస్మికంగా ఒకేసారి లక్షలమంది కార్మికులు పనులు కోల్పోయారు. వీరందరికీ వ్యవసాయరంగం పనులు కల్పించే అవకాశం లేదు. ఉదాహరణకు 2022 మార్చిలో వ్యవసాయ కార్యకలాపాలు 10.4శాతం పెరిగాయి. ఆ తర్వాత ఏప్రిల్‌లో 3శాతం, మేలో 6శాతం, జూన్‌లో 6శాతానికంటే ఎక్కువగా కార్మికులు పనులు కోల్పోయారు. మార్చిలో 12శాతం పెరిగినప్పటికీ అది తాత్కాలికమే. ఈ వేసవికాలంలో వ్యవసాయ కార్యకలాపాలు గణనీయంగా తగ్గిపోతాయి. అందువల్ల లక్షలాదిమందికి వ్యవసాయరంగంలో పనులు లభించవు. వ్యవసాయ రంగంలో కార్యకలాపాలు ఆయా సీజన్‌లనుబట్టి పెరగడం, తరగడం ఉంటుంది.

చదవడం కాదు, సి.వి. రచనలు జీర్ణించుకోవాలి

డాక్టర్ దేవరాజు మహారాజు

రక్తమాంసాలు గల మానవుణ్ని ప్రేమిస్తాను
అవిటిచెవిటి మూగదేవుణ్ని మాత్రం నమ్మను
మానవుణ్ణి ద్వేషించే మీరు దేవుణ్ని పూజిస్తారు
దేవుణ్నికాదనే నేను, మానవుణ్ని ప్రేమిస్తాను!

'నరబలి' కావ్యంలో వేనుని కథని సి.వి. తనదైన ఆధునిక దృక్కోణంతో రాశారు. తన సిద్ధాంతాన్ని వేనుని పాత్ర ద్వారా అలా వెల్లడించారు.

"పట్టెడన్నం పెట్ట నిరాకరిస్తున్న వర్గం/అప్పనంగా మంది సొమ్ము తినమరిగిన పూజారి పురోహిత వర్గం/కొండల్లో ఎన్నడో పారిపోయి బండరాయిలా దాక్కున్న నిన్ను/వెతికి వెతికి పట్టుకొచ్చి వీధికెక్కించారు గదరా!"–అని దేవుణ్ణి ఎద్దేవా చేశారు సి.వి. తన 'ఊళ్లోకి స్వాములోరు వచ్చారు' కావ్యంలో ఇంతకీ ఎవరీ సి.వి? ఈ తరం యువతీ యువకులకు అంతగా పరిచయం ఉండకపోవచ్చు. సి.వి.పూర్తిపేరు చిత్తజల్లు వరహాలరావు(14.01.1930–8.11.2017) కానీ, పొడి అక్షరాలతో "సి.వి"–గానే ప్రసిద్ధులు. కవి, రచయిత, హేతువాది, సాంస్కృతిక రథ సారథి. నిత్య పరిశోధకుడు, దిగంబర కవుల మార్గదర్శి, శాస్త్రీయ విజ్ఞాన కార్యకర్త, మార్క్స్–ఏంగెల్స్‌లను అమితంగా ప్రేమించిన వాడు, సీపీఐ (యంఎల్) వైపు నిలబడ్డానని ప్రకటించుకున్నవాడు. కొన్ని విభేదాలు ఉన్నా శ్రీశ్రీకి ఏకలవ్య శిష్యుడు ఇలా ఎన్నయినా చెప్పుకోవచ్చు. "సాయుధవిప్లవం ద్వారా ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకోవడం–కష్టజీవులు తమ భవితవ్యానికి తామే అధినాథులు కావడం" అని పారిస్ కమ్యూన్ సారాంశాన్ని విప్పి చెప్పారు. సి.వి! గుంటూరులో జన్మించిన ఈ ముందు తరం రచయిత, మరణించేంతవరకు విజయవాడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్నారు. సి.వి.తండ్రి వెంకటా చలపతి స్వాతంత్ర్య సమరయోధుడు. తల్లి లక్ష్మీ దేవమ్మ. గుంటూరు ఏ.సి.కాలేజీలో బి.ఏ చదువుతూ ఉండగా, విప్లవ దళితకవి శివసాగర్ సి.వికి క్లాసుమేట్. తర్వాత,ఎకనామిక్స్‌లో పి.జి. డిగ్రీ, మద్రాసుక్రిస్టియన్ కాలేజి నుండి తీసుకున్నారు(1958). మద్రాసులో విద్యార్థిగా ఉన్న రోజుల్లో ఎక్కువకాలం అక్కడి కన్నెమెర (గ్రంధాలయంలో గడిపేవారు. కావల్సిన విషయాలన్నీ నోట్స్ రాసుకునేవారు) అవే ఆయనకు తర్వాత కాలంలో 30 పుస్తకాలు రాయడానికి ఉపయోగపడ్డాయి.(ఈయన 'నరబలి' గ్రంధాన్ని నారాయణస్వామి కన్నడంలోకి అనువదిస్తే, కారు చీకట్లో రచనను వేగుంట మోహనప్రసాదు ఇంగ్లీషులోకి అనువదించారు.)

1950లోని మార్క్సిస్టు ఉద్యమాలతో మమేకమైన సి.వి. మొదట కవిగా సాహిత్య ప్రపంచంలోకి అడుగుపెట్టారు. తర్వాత కాలంలో విషయాలు వివరంగా ప్రజల్లోకి వెళ్లాలంటే పద్యంకన్నా గద్యమే సరైనదని గ్రహించారు. ఆ రకంగా ఎన్నో రచనలు వెలువరించారు. నరబలి, సత్యకామ జాబాలి, ఏడుకొండల వాడా గోవిందా, ఆంధ్రలో సాంఘిక తిరుగుబాటు ఉద్యమాలు కారుచీకటిలో కాంతిరేఖ, స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ, భారత జాతీయ పునరుజ్జీవనం, విషాద భారతం, పారిస్ కమ్యూన్, కౌటిల్యుని అర్థశాస్త్రం, పుట్టుపుర్వోత్తరాలు వంటి పుస్తకాలన్నీ ఆయనను సామాజిక విప్లవ కారుడిగా నిలబెడతాయి. వర్ణవ్యవస్థ, మనుధర్మశాస్త్రం, ప్రాచీన భారతంలో చార్వాకం, ఆధునిక యుగంలో కులవ్యవస్థ వంటి గ్రంథాలు ఆయన ఎంతటి హేతువాదో నిరూపిస్తాయి. డార్విన్ పరిణామ వాదం, సింధూ నాగరికత వంటి రచనలు ఆయనలోని వైజ్ఞానిక స్పృహను వెల్లడిస్తాయి. ఆయన స్వయంగా సైన్సు విద్యార్థి కాకపోయినా, వైజ్ఞానిక దృక్పథమన్నది ప్రజల్లో ప్రతి ఒక్కరిలో ఉండాల్సిన అంశమని ఆయన గ్రహించారు. ఇవన్నీ ఒక ఎత్తయితే, దళిత ఉద్యమ వైతాళికుడైన కుసుమ ధర్మన్నను వెలికితీసి పరిచయం చేయడం మరొక ఎత్తు. అంతేకాదు దళిత సాహిత్యోద్యమానికి ఒక పునాదిరాయి కావడం–సి.వి. గొప్పదనం! ఆయనలో తెలియకుండానే ఒక గొప్ప పరిశోధకుడు, ఒక చరిత్రకారుడు, ఒకవైజ్ఞానికుడు ఉండడం విశేషం. ఈ లక్షణాలు లేని ఉట్టి కవులూ, రచయితలు తెలుగువారిలో చాలా మంది ఉన్నారు. వారితో సమాజానికి ఎక్కువగా ఉపయోగం ఉండదు. ప్రశ్నించని వాడు, ప్రశ్నను నిలబెట్టనివాడు హేతువాది కానివాడి వల్ల, సమాజానికి ఉపయోగ మేమిటీ? ఆ రకంగా పైరవీలుచేసి అవార్డులు తెచ్చుకున్న వారికన్నా, ప్రభుత్వంలో ఉన్నవారికి భజనలుచేసి పదవులు అనుభవించిన వారికన్నా సి.వి. జీవితం చాలాచాలా విలువైంది. అందుకే చెప్పేది, ఆయన రచనలు ఊరికే చదవడంకాదు।అధ్యయనం చేయాలి! అంతకన్నా ముఖ్యం జీర్ణించుకోవాలి!! ఆచరించాలి.

"నెరసిన గుబురు మీసాలు/పెరిగిన బైరుగడ్డమూ/మానవతను విరజిమ్మే నేత్రాలూ/రక్తమూ కన్నీరు కలిసి సృష్టించిన కొత్త సిద్ధాంతాన్ని/ప్రపంచ పీడిత ప్రజాకోటి సమర్పించే/మానవోన్నతునిలా ఉన్న ఈయన ఎవరూ? ఆహా ఈయనే కార్ల్ మార్క్స్/మూర్తీభవించిన తత్వశాస్త్రంలా ఉన్న ఏంగెల్స్"–అని మార్క్సిజం సృష్టికర్తల్ని తన్మయత్వంతో పాఠకుల కళ్ల ముందు చిత్రీకరించారు సి.వి. అంతేకాదు, 'మానవోన్నత మూర్తి స్టాలిన్'–అనే ఒక స్మృతి గీతం కూడా రాశారు. కమ్యూనిస్టు ఉద్యమంతో ఇంతగా పెనవేసుకుపోయిన సి.వి, సమకాలీనంలో ఉన్న కొందరు కమ్యూనిస్టులను తీవ్రంగా దుయ్యబట్టారు. అయితే అది కమ్యూనిజం తప్పుకాదనీ, దాని విలువల్ని నిలుపుకోలేని కొందరు వ్యక్తుల తప్పిదమని వివరణ ఇచ్చారు. వామపక్షవాదులలో సైతం ఇంకా వదలని కులతత్వాన్ని, ప్రాంతీయ విభేదాల్ని ఎత్తిచూపడానికి ఆయన ఏ మాత్రం జంకలేదు, గొంకులేదు–వ్యక్తులకైనా, పార్టీకైనా, అధికారంలో ఉన్నవారికైనా, లేనివారికైనా అంతర్మథనం అవసరం. అత్మ విమర్శ అన్నింటికంటే ముఖ్యం.

"కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఒకసారి, మత తత్త్వంపై మరోసారి, దున్నేవానికే భూమి అని ఒకసారి రాజ్యాధికారానికి వేరొకసారి ఇలా ఉద్యమాలు, పోరాటాలు వేటికవి విడివిడిగా ఉండవేమోనని నేననుకుంటున్నాను. దోపిడీ శక్తుల కులమూ, వర్గమూ, రాజ్యమూ కలగలిసి ఉన్న వ్యవస్థలో పీడిత కులాల వర్గాల ఉద్యమాలు, పోరాటాలేకాదు, ఉద్యమ శక్తులు కూడా కలగలిసే ఉండాలి. వారి నడుమ కనీస సమన్వయం, సహకారం ఉండాలి. పందులదొడ్డి కంటే హీనంగా దేశాన్ని దిగజార్చిన పాలకులు విసిరే ఎంగిలి మెతుకులకు ఆశించకుండా లొంగకుండా, ఉద్యమ శక్తులు పోరాట చేవతో సమరశీలంగా సాగాలి. సాహిత్యం, సాంస్కృతిక రంగాలలో కృషి, సాంఘిక రాజకీయ రంగాలలో కృషితో సమన్వయం కావాలి. వర్గపోరాటం అగ్రకుల వ్యతిరేక పోరాటంతో భూ స్వామ్య వ్యతిరేక పోరాటంలో భుజం భుజం కలిపిసాగాలి.

సమాజంలోని కులం, మతం, వర్ణవ్యవస్థ వంటి విషయాలపై కమ్యూనిస్టులు చేయాల్సినంత చేయలేదని సి.వి.భావన. అందుకే ఆయనే స్వయంగా ఆయా విషయాలపై విస్తృతంగా రచనలుచేస్తూ వచ్చారు. "వర్ణవ్యవస్థలాంటి భ్రష్టమైన వ్యవస్థఈ భూ మండలంలో ఎక్కడైనా ఉందా? వైదికపురోహిత పరాన్నభుక్కు వర్గమా/పాలకవర్గ శునకాల్ని మీరు ఇస్కో ఇస్కో అంటూ/పాలితులనే కవ్విస్తున్నారు/వాళ్లే ఇస్కో ఇస్కో అనేదశ ఆద్యంతాన భవిష్యత్తులో రాబోతోంది జాగ్రత్త!" అని పేదల, శ్రామికుల తిరుగుబాటు అనివార్యం అని 'జాబాలి' ద్వారా హెచ్చరించారు" (సత్యకామ జాబాలి 1972) శతాబ్దాలుగా కొనసాగుతున్న తతంగాన్నంతా సి.వి.నాలుగు వాక్యాల్లో తేల్చేశారు. భారతదేశంలో ఫ్యూడల్ వర్గాలు బ్రాహ్మణీయ భావజాలాన్ని ప్రజలపై రుద్ది,సాంస్కృతికంగా కులాల్ని స్థిరపరిచాయి. అవి అలా కొనసాగడానికి కల్పిత పురాణాలు, నిచ్చెనమెట్ల వ్యవస్థ, ఆత్మలు, పరమాత్మలు, పునర్జన్మలు, దేవుని పేరిట ఛాందస ఆచారాలూ సృష్టించి సమాజాన్ని కుళ్లబొడిచారు. సి.వి ఇలాంటి విషయాలపై లోతుగా అధ్యయనం చేశారు. ఇతర ఏ కమ్యూనిస్టు రచయితా రాయనంత స్పష్టంగా, బలంగా గ్రంథ రచనచేసి కొత్త తరాల్ని కూడా ప్రభావితం చేశారు. ఈ విషయాల్నింటినీ గుదిగుచ్చి ఉద్యమ స్వరూపాన్ని సి.వి. స్పష్టంగా ఇలా వెల్లడింఎచారు.

"కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఒకసారి, మత తత్త్వంపై మరోసారి, దున్నేవానికే భూమి అని ఒకసారి రాజ్యాధికారానికి వేరొకసారి ఇలా ఉద్యమాలు, పోరాటాలు వేటికవి విడివిడిగా ఉండవేమోనని నేననుకుంటున్నాను. దోపిడీ శక్తుల కులమూ, వర్గమూ, రాజ్యమూ కలగలిసి ఉన్న వ్యవస్థలో పీడిత కులాల వర్గాల ఉద్యమాలు, పోరాటాలేకాదు, ఉద్యమ శక్తులు కూడా కలగలిసే ఉండాలి. వారి నడుమ కనీస సమన్వయం, సహకారం ఉండాలి. పందులదొడ్డి కంటే హీనంగా దేశాన్ని దిగజార్చిన పాలకులు విసిరే ఎంగిలి మెతుకులకు ఆశించకుండా లొంగకుండా, ఉద్యమ శక్తులు పోరాట చేవతో సమరశీలంగా సాగాలి. సాహిత్యం, సాంస్కృతిక రంగాలలో కృషి, సాంఘిక రాజకీయ రంగాలలో కృషితో సమన్వయం కావాలి. వర్గపోరాటం అగ్రకుల వ్యతిరేక పోరాటంతో భూ స్వామ్య వ్యతిరేక పోరాటంలో భుజం భుజం కలిపిసాగాలి. దళితులు, మహిళలు, మైనారిటీలు, ఆదివాసీ పోరాటాలు, శ్రామిక వర్గ పోరాటాలతో మమేకం కావాలి"–ఇంత స్పష్టంగా, ఇంత సరళంగా ఉద్యమ స్వరూపం గురించి చెప్పిన రచయిత మరొకరులేరంటే అతిశయోక్తి కాదు. కానీ, కాలగమనంలో ఏమైంది? దళితులు, మహిళలు, మైనార్టీలు విడివిడిగా తమతమ అస్థిత్వ పోరాటాలు చేస్తూ వస్తున్నారు. అందరూ సంఘటితంగా, సమైక్యంగా ఉద్యమించాల్సిందిపోయి, విడిపోవడంవల్ల బలహీనపడ్డాయి. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు అధికారం అప్పగించడమంటే మిగతావన్నీ బలహీన పడ్డాయనేకదా అర్థం? ఇది తాత్కాలికం అనుకుని, సి.వి.సూచించిన మార్గంలో ఉద్యమించక తప్పదు! ఐక్యపోరాటానికి సంసిద్ధులు కాక తప్పదు.

–సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

కొత్తగా 6155 మందికి కరోనా

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు రోజురోజుకు అధికమవుతున్నాయి. తాజా పెరుగుదలకు ఎక్స్‌బీబీ 1.16 లేదా అర్క్టురస్‌గా పిలిచే కొత్త వేరియంట్ కారణంగా వైద్యనిపుణులు భావిస్తున్నారు. దేశంలో శుక్రవారం 6050 కేసులు నమోదవగా, గత 24 గంటల్లో మరో 6155 మంది కరోనా బారినపడ్డారు. గత 204 రోజుల్లో ఇదే అత్యధికం. గతేడాది సెప్టెంబర్ 16న 6,298 కేసులు నమోదయ్యాయి. దేశంలో కరోనా బాధితుల సంఖ్య 4,47,51,259కి చేరింది. ఇందులో 5,30,954 మంది మరణించారు. ప్రస్తుతం 31,194 కేసులు క్రియాశీలకంగా ఉన్నాయి. గత 24 గంటల్లో 11 మరణాలు నమోదయ్యాయి. మొత్తం కేసుల్లో 0.07 శాతం కేసులు క్రియాశీలంగా ఉండగా, 98.74 శాతం మంది కోలుకున్నారు. 1.19 శాతం మంది మృతిచెందారు. రోజువారీ పాజిటివిటీ రేటు 5.63 శాతానికి పెరిగాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 220.66 కోట్ల కరోనా వాక్సిన్ డోసులను పంపిణీ చేశామని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది.

వాయిదా పద్ధతిలో మామిడి పండ్లు!

పూనే వ్యాపారి వినూత్న ప్రతిపాదన

పూనే: టీవీలు, ఏసీలు, ఫోన్లు ఇలా ఖరీదైన వస్తువులను వాయిదా పద్ధతిలో కొనుగోలు చేస్తుంటాం. కానీ, ఇప్పుడు మామిడి పండ్లు కూడా వాయిదా పద్ధతిలో లభించనున్నాయి. మామిడి పండ్ల ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో మహారాష్ట్రకు చెందిన ఒక వ్యాపారి ఇలా వినూత్నంగా విక్రయాలు చేపట్టారు. మామిడి పండంటే ఎవరికి ఇష్టం ఉండదు. అయితే వేసవి సీజన్ ప్రారంభంలో వీటి ధరలు విపరీతంగా ఉంటున్నాయి. ముఖ్యంగా సింధ్‌దుర్గ్ జిల్లాలోని దేవగఢ్, రత్నగిరి జిల్లాల్లో దొరికే ఆల్ఫోన్సో రకం మామిడి పండ్లు భారీగా ధర పలుకుతున్నాయి. రిటైల్ మార్కెట్‌లో వీటి ధర డజన్‌కు రూ.800 నుంచి రూ.1300 వరకు ఉంటుంది. దీంతో పూణెకు చెందిన గౌరవ్ సనాస్ వినూత్న ఆలోచన చేశారు. తమ దుకాణాల్లో వాయిదా పద్ధతిలో రుచికరమైన మామిడి పండ్లను కొనుక్కోవచ్చని తెలిపారు. అయితే దీనికి కొన్ని షరతులున్నాయి. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుందట. కనీసం రూ.5000 అంతకంటే ఎక్కువ విలువ చేసే పండ్లు కొనుగోలు చేస్తేనే ఈఎంఐ సదుపాయం ఉంటుందని గౌరవ్ తెలిపారు. ఇందుకోసం ఆయన పేటీఎం స్వైప్ మిషన్‌ను వినియోగిస్తున్నారు. కస్టమర్ మామిడి పండ్లను కొనుగోలు చేసిన తర్వాత క్రెడిట్ కార్డుతో ఈ మిషన్‌లో స్వైప్ చేసి బిల్లు తీసుకుంటున్నారు. అప్పుడు మిషన్‌లో కన్పించే ఈఎంఐ ఆప్షన్‌ను ఎంచుకుంటే బిల్లును మూడు, ఆరు, 12 నెలవారీ వాయిదాల్లో చెల్లించొచ్చని ఆయన తెలిపారు. "ఈ పండ్లను తినాలని చాలా మందికి ఉన్నా ధర కారణంగా చాలా మంది కొనుగోలుకు ఆసక్తి చూపించట్లేదు. అందుకే అందరికీ ధరలు అందుబాటులో ఉండాలని వాయిదాల పద్ధతి తీసుకొచ్చాం" అని గౌరవ్ తెలిపారు. గురుకృప ట్రేడర్స్ అండ్ ఫ్రూట్ ప్రోడక్ట్స్ పేరుతో ఆయన స్థానికంగా రిటైల్ పండ్ల వ్యాపారం చేస్తున్నారు.

క్రికెట్ బుకీని అరెస్టు చేసిన ఈడీ

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: ఐపీఎల్ బెట్టింగ్ రాకెట్ దర్యాప్తునకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై బుకీ అనిల్ జై సింఘానీని ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ భార్య అమృత ఫడ్నవిస్‌ను ముడుపుల కోసం బ్లాక్‌మెయిల్ చేశారన్న ఆరోపణలపై ముంబై పోలీసులు ఇటీవల జైసంఘానీ, ఆయన కుమార్తె అనిక్షను అరెస్టు చేశారు. అనేక కేసుల నుంచి తనను తప్పించాలని అమృతను బెదిరించినట్లు జైసింఘానీపై ఆరోపణలు ఉన్నాయి. ముంబై కోర్టులో ప్రొడక్షన్ వారెంట్ వేయడం ద్వారా జైసింఘానీని ఈడీ తమ అదుపులోకి తీసుకున్నది. 2015 నాటి ఐపీఎల్ మ్యాచ్‌లతో బెట్టింగ్ ఆరోపణ కేసును ఈడీ విచారిస్తోంది. శుక్రవారమే సింఘానీని అదుపులోకి తీసుకున్న ఈడీ...ఆయన వాంగ్మూలం నమోదు చేసినట్లు తెలుస్తోంది. మరో కేసులో సింఘానీని మధ్యప్రదేశ్ పోలీసులు కూడా ఇటీవల అదుపులోకి తీసుకున్నారు.

అమ్మాయిల దుస్తులపై బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్య

ఇండోర్: బీజేపీ నేత కైలాశ్ విజయ్‌వర్గీయ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆడవాళ్ల దుస్తులపై ఆయన వికృత వ్యాఖ్య చేశారు. సరైన దుస్తులు వేసుకోని ఆడవాళ్లను ఆయన సూర్పనకతో పోల్చారు. హనుమాన్ జయంతి సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాత్రి పూట బయట తిరుగుతున్న సమయంలో మత్తులో ఉన్న యువతను చూస్తుంటానని, వాళ్ల చెంప పగలగొట్టాలన్న కోపం వస్తుందని ఆయన అన్నారు. ఇక సరైన దుస్తులు వేసుకోని అమ్మాయిలను ఆయన తప్పుపట్టారు. మహిళలను దేవతలుగా ఆరాధిస్తామని, కానీ సరైన దుస్తులు వేసుకోని అమ్మాయిల్లో ఆ ఆనవాళ్లు ఉండవన్నారు. వాళ్లు సూర్పనకలాగా కనిపిస్తారన్నారు. దేవుడు మీకు మంచి శరీరాన్ని ఇచ్చారని, మంచి దుస్తులు వేసుకోవాలని సలహా ఇచ్చారు. పిల్లలకు మంచి బుద్దులు నేర్పాలని ఆయన సూచన చేశారు. బీజేపీ నేత కైలాశ్ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

విద్యలో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు

న్యూఢిల్లీ : కొంతమంది పిల్లలు చదువులో బలహీనంగా ఉంటే, వారికి అదనపు తరగతులు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం తెలిపారు. 'ఈ పిల్లలలో ఒకరు భవిష్యత్తులో దేశానికి ప్రధానమంత్రి అవుతారు. భవిష్యత్తులో ఎవరూ నకిలీ డిగ్రీతో ప్రధాని కావాలని మేము కోరుకోము' అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మార్కు షీట్లను పోస్ట్ చేసిన బీజేపీ అధికార ప్రతినిధి హరీష్ ఖురానాకు ప్రతిస్పందనగా ముఖ్యమంత్రి నుంచి ఈ ప్రకటన వచ్చింది. ప్రతి సంవత్సరం 1 లక్ష మంది పిల్లలు 9వ తరగతిలో ఫెయిల్ అవుతున్నారని ఖురానా ఆరోపించారు. అంతకుముందు, ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లోని 9, 11వ తరగతి విద్యార్థుల 'ఖాళీ పరీక్షా పత్రాలపై సమాధానాలు' రాయమని ఉపాధ్యాయులు 'బలవంతం' చేసిన ఆరోపణలపై విచారణ జరపాలని ఢిల్లీ కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

హోటల్ నుంచి బీహార్ మంత్రి సామాను తొలగింపు

వారణాసి : బీహార్ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ దర్శనానికి వెళ్లిన సమయంలో వారణాసిలోని ఒక హోటల్ యాజమాన్యం ఆయన గది నుంచి లగేజీని తొలగించిందని పోలీసులు శనివారం తెలిపారు. మంత్రికి కేటాయించిన గదిని తెరిచి ఆయన వస్తువులను తాకడం భద్రత దృష్ట్యా సురక్షితం కాదని మంత్రి వ్యక్తిగత సహాయకుడు విశాల్ సిన్హా ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి యాదవ్ హోటల్‌కు తిరిగి వచ్చినప్పుడు, రిసెప్షన్‌లో మంత్రి లగేజీ కనిపించిందని సిన్హా చెప్పారు. ఏప్రిల్ 6న బీహార్ పర్యావరణ, అటవీ మంత్రికి చెందిన సన్నిహితుడు ఒకరోజు గదిని బుక్ చేసుకున్నట్లు హోటల్ యాజమాన్యం పోలీసులకు చెప్పిందని అదనపు పోలీసు కమిషనర్ సంతోష్ సింగ్ తెలిపారు. ఈ గది ఎవరి కోసం బుక్ చేశారో హోటల్ యాజమాన్యానికి తెలియదని సింగ్ చెప్పారు. మరుసటి రోజు అంటే ఏప్రిల్ 7న హోటల్ గది ఎవరో బుక్ చేశారు. కానీ యాదవ్ 'దర్శనం' కోసం వెళ్లాడు. అతని సహాయకుల్లో ఒకరు హోటల్‌లో ఉండిపోయారు. యాదవ్ తిరిగి వస్తాడని యాజమాన్యం చాలాసేపు ఎదురుచూసింది. తదనంతరం, ఆయన వస్తువులను రిసెప్షన్‌లో ఉంచినట్లు సింగ్ చెప్పారు. హోటల్‌కు తిరిగి వచ్చిన తర్వాత, హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిగ్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశాడు. సిగ్రా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో రాజు సింగ్ మాట్లాడుతూ ఫిర్యాదు స్వీకరించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యాదవ్ సహాయకుడు సిన్హా మాట్లాడుతూ, ఆయన, భద్రతా సిబ్బంది మంత్రి పక్కనే ఉన్న గదిలో ఉన్నారని తెలిపాడు.

ఉదయం 7.30 నుంచే పంజాబ్ ప్రభుత్వ కార్యాలయాలు

చండీగఢ్ : వచ్చే నెల నుంచి ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తమ ప్రభుత్వం కార్యాలయాల సమయాన్ని మార్చాలని నిర్ణయించినట్లు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శనివారం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాల సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంది. 'మే 2 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 7.30 గంటలకు తెరిచి మధ్యాహ్నం 2 గంటలకు తెరిచి ఉంచాలని పంజాబ్ ప్రభుత్వం నిర్ణయించింది' అని మాన్ ఒక వీడియో సందేశంలో తెలిపారు. కార్యాలయ కొత్త సమయం జులై 15 వరకు అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అనేక మందితో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాన్ తెలిపారు. వేసవిలో కార్యాలయ సమయాల్లో మార్పు వల్ల విద్యుత్ డిమాండ్‌పై భారం తగ్గుతుందని ఆయన అన్నారు. 'పంజాబ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ అధిక లోడు (విద్యుత్) మధ్యాహ్నం 1.30 తర్వాత ప్రారంభమవుతుందని, ప్రభుత్వ కార్యాలయాలను మధ్యాహ్నం 2 గంటలకు మూసివేస్తే, అది 300 నుంచి 350 మెగావాట్ల వరకు అధిక లోడు తగ్గించడంలో సహాయపడుతుందని పేర్కొంది' అని ముఖ్యమంత్రి తెలిపారు. 'నేను కూడా ఉదయం 7.30 గంటలకు నా కార్యాలయానికి చేరుకుంటాను' అని అన్నారు.

పాఠశాలను కూల్చివేసే కుట్ర: కేజ్రీవాల్ ధ్వజం

న్యూఢిల్లీ : పాఠశాలలు కూల్చివేస్తే బీజేపీ పేరు చరిత్రలో నిలిచిపోతుందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శనివారం కాషాయ పార్టీపై ధ్వజమెత్తారు. తూర్పు వినోద్ నగర్‌లో పాఠశాలను ప్రారంభించిన తర్వాత కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌పై ఉన్న తన కొత్త కేంద్ర కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శుక్రవారం ఆరోపించింది. అయితే ఆరోపణలను బీజేపీ ఖండించింది. పాఠశాల భవనం చాలా ఏళ్లుగా పాడుబడి ఉందని, అక్కడ ఏ పాఠశాల కూడా నడవడం లేదని బీజేపీ పేర్కొంది. అలాగే, ఈ భవనం సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) భూమిలో ఉంది. ఇది దాని స్వాధీనం తిరిగి తీసుకోవాలని ఎంసీడీ ఇప్పటికే నోటీసు ఇచ్చిందని తెలిపింది. బీజేపీ కొత్త కేంద్ర కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఆక్రమించిందని, దానిపై ఆ పార్టీ బుల్‌డోజర్లను నడపాలని యోచిస్తోందని ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్ శుక్రవారం ఆరోపించారు.

కర్నాటక కాంగ్రెస్‌లో అసమ్మతి

- ఆశావహులకు భంగపాటు
- అంతర్గతంగా రగిలిపోతున్న నేతలు
- కొంతమంది పక్కచూపులు

బెంగళూరు: కర్నాటక కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాల రగులుతోంది. ప్రత్యేకించి కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థుల రెండో జాబితా విడుదల చేసిన తర్వాత ఈ అసమ్మతి, అలకలు ముదిరపాకాన పడ్డాయి. కొంతమంది ఆశావహులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తంచేయకపోయినప్పటికీ లోలోన రగిలిపోతున్నారు. ప్రత్యేకించి కాంగ్రెస్‌లోని ఓ వర్గం ఆగ్రహంతో ఉంది. పార్టీని వీడాలని కొంతమంది భావిస్తున్నారు. తమ మద్దతుదారులతో చర్చించి...భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఇద్దరు కీలకనేతలు ప్రకటించారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు మే 10వ తేదీన ఒకే విడతలో జరగనున్నాయి. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ప్రారంభించాయి. కాంగ్రెస్ తమ అభ్యర్థులకు సంబంధించి రెండు జాబితాలు ప్రకటించినప్పటికీ బీజేపీ మాత్రం ఇంకా ఆ పని చేయలేదు.

చిత్రదుర్గ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్సీ రఘు ఆచార్ కోపంతో రగిలిపోతున్నారు. తనకు టికెట్ నిరాకరించినందుకు నిరసనగా ఏప్రిల్ 14న తాను జేడీఎస్‌లో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. చిత్రదుర్గ జిల్లాలోని అన్ని సీట్లు జేడీఎస్ గెలిచేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. జేడీఎస్ నేత టీఏ శరవణ శుక్రవారం ఆచార్‌ను కలిశారు. ఆ తర్వాత శరవణ మాట్లాడుతూ ఆచార్ తమను ఎలాంటి డిమాండ్ చేయలేదని, అయితే, తనను అవమానించినందుకుగాను కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్న సంకల్పంతో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ టికెట్ దక్కన మరో సీనియర్ నేత కేసీ వీరేంద్ర(పప్పీ) ఆచార్‌ను కలిశారు. ఇప్పటికే ఆలస్యమైందని, తనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 17న నామినేషన్ దాఖలు చేస్తానని పప్పీ ఇప్పటికే ప్రకటించారు. పప్పీ మంచి మిత్రుడని, ఆయనకు మంచి జరగాలని కోరుకుంటున్నానని ఆచార్ చెప్పారు. టికెట్ ఆశించి భంగపడిన చిత్రదుర్గ జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత ఎస్‌కే బసవరాజన్ కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారని, మద్దతుదారులతో సమావేశమై భవిష్యత్‌పై నిర్ణయం తీసుకుంటారని కాంగ్రెస్ వర్గాలే చెబుతున్నాయి. మాండ్య టికెట్ ఆశించిన కేకే రాధాకృష్ణ తన మద్దతుదారులతో సమావేశమైన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ వారం రోజులపాటు నియోజకవర్గమంతా పర్యటిస్తానని, ఆ తర్వాత నిర్ణయం ప్రకటిస్తానని తెలిపారు. అయితే, తాను ఇప్పటికీ పార్టీలోనే ఉన్నానని, పార్టీ నాయకులు, మద్దతుదారులతో మరోసారి సమావేశమవుతానని చెప్పారు. ఏప్రిల్ 13 తర్వాత మద్దతుదారులతో మాట్లాడి...తన నిర్ణయం ప్రకటిస్తానన్నారు. మాండ్య టికెట్‌ను పి.రవికుమార్‌కు అధిష్ఠానం కేటాయించింది. కదూర్ టికెట్ ఆశించిన వైఎస్‌వీ దత్తా కూడా ఆదివారం తన మద్దతుదారులతో సమావేశమయ్యారు. పార్టీలో తనకు అవమానం జరిగిందని మద్దతుదారుల వద్ద వాపోయారు. ఇటీవలే జేడీఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దత్తాకు కదూర్ సీటు లభిస్తుందని అందరూ భావించారు. అయితే, ఆ టికెట్‌ను ఆనంద్ కేఎస్‌కు కేటాయించారు. వాస్తవంగా మాజీ ప్రధాని, జేడీఎస్ వ్యవస్థాపకుడు హెచ్‌డీ దేవెగౌడకు అత్యంత సన్నిహితుడిగా దత్తాకు గుర్తింపు ఉంది. ఈ అనుమానంతోనే కాంగ్రెస్ ఆయనకు టికెట్ నిరాకరించినట్లు చెబుతున్నారు. పులికేశినగర్ ఎమ్మెల్యే ఆర్.అఖండ శ్రీనివాస మూర్తికి ఇంకా ఆ టికెట్ కేటాయించలేదు. దీంతో ఆయన అయోమయంలో ఉన్నారు. టికెట్ కోసం ఆయన సీఎల్‌పీ నేత సిద్ధరామయ్యతో మంతనాలు సాగిస్తున్నారు. 'పులికేశినగర్ సీటు కచ్చితంగా నాకే దక్కుతుంది. ఎందుకంటే...గత ఎన్నికల్లో అక్కడ నుంచి నేను అత్యధిక ఓట్లతో గెలిచాను. టికెట్ కేటాయించడంలో జాప్యం ఎందుకు జరుగుతుందో పార్టీ అధిష్ఠానాన్ని మీరే అడగండి. తదుపరి జాబితాలో ప్రకటిస్తారని నేను నమ్మకంతో ఉన్నాను.

ఆ సీటు నాకే ఇస్తారని మా నాయకుడు స్పష్టంచేశారు' అని మూర్తి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రెండు జాబితాల ద్వారా ఇప్పటి వరకు 224 సీట్లకుగాను 166 పేర్లను ప్రకటించింది. మిగిలిన 58 మంది అభ్యర్థుల పేర్లను ఇంకా ఖరారు చేయలేదు.

చెన్నై విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనం ప్రారంభించిన మోదీ

చెన్నై : చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.1,260 కోట్లతో నిర్మించిన ప్రయాణికుల నిర్వహణను పెంపొందించే సదుపాయం కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ (ఫేజ్-1) ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. ఎన్ఐటీబీ రాష్ట్రం గొప్ప సంస్కృతి, వారసత్వాన్ని ప్రదర్శించడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది. 'ఈ కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ని అదనంగా చేర్చడం వలన విమానాశ్రయం ప్రయాణీకుల సేవల సామర్థ్యం సంవత్సరానికి 23 మిలియన్ల ప్రయాణికులు (ఎంపీపీఏ) నుంచి 30 ఎంపీపీఏ కి పెరుగుతుంది. కొత్త టెర్మినల్ స్థానిక తమిళ సంస్కృతికి అద్భుతమైన ప్రతిబింబం. ఇది సంప్రదాయ లక్షణాలను కలిగి ఉంటుంది. కోలం, చీర, దేవాలయాలు, ఇతర సహజ పరిసరాల ప్రాముఖ్యతను తెలిపే అంశాలు' అని ప్రభుత్వం తెలిపింది. భవనంలో చేర్చిన ప్రతి రూపకల్పన బాగా ఆలోచించి చేశారు. తాటి చెట్టు విజువల్ ఎఫెక్ట్‌ను రూపొందించడానికి నిలువు వరుసలు రూపొందించారు. అలాగే దక్షిణ భారతదేశంలోని కోలం (రంగోలి) నమూనాలను ప్రతిబింబించేలా పైకప్పులను మోటిఫ్ లైట్లతో అలంకరించారు. పైకప్పు రూపకల్పనను భరతనాట్యం నుంచి తీసుకున్నారని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తెలిపింది. 'ఉంగరాల రూఫింగ్ రాష్ట్ర భరతనాట్యం సాంప్రదాయ నృత్య రూపమైన నర్తకి కదలికల సమయంలో అభిమానులను ఆకర్షణీయంగా ప్రదర్శించే ముడతల దుస్తులను ప్రతిబింబిస్తోంది' అని పేర్కొంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం సింధియా, తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టర్మినల్ చుట్టూ తిరుగుతున్నప్పుడు స్టాలిన్‌తో ప్రధాన మంత్రి కొన్ని స్నేహపూర్వక క్షణాలను కలిగి ఉండటం కనిపించింది. సీఎం చేయి పట్టుకుని, ఇద్దరూ నవ్వుతూ ఉండగా, రెండోవారు అతనిని తట్టుతూ కనిపించారు.

చెన్నై-కోయంబత్తూర్ 'వందేభారత్' రైలు ప్రారంభం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం చెన్నై-కోయంబత్తూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఇది రాష్ట్ర రాజధాని, పశ్చిమ పారిశ్రామిక నగరం మధ్య ప్రయాణ సమయాన్ని గంటకు పైగా తగ్గించవచ్చని భావిస్తున్నారు. డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రత్యేకమైనది, ఆధునిక ఫీచర్లు, ప్రయాణీకుల సౌకర్యాలతో కూడిన రైలును జెండా ఊపి ప్రారంభించారు. రైలులో పాఠశాల విద్యార్థులతోనూ ఆయన ముచ్చటించారు. 'ఇది 5 గంటల 50 నిమిషాల ప్రయాణ సమయంతో రెండు నగరాల మధ్య అత్యంత వేగవంతమైన రైలు. ఇది ఒక గంట కంటే ఎక్కువ ప్రయాణ సమయాన్ని ఆదా చేస్తుంది' అని అధికారిక ప్రకటన తెలిపింది. తమిళనాడుకు చెందిన రెండు నగరాలను కలుపుతున్న ఈ రైలు... స్వదేశీ ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవాచ్'ను కలిగి ఉంది. అలాగే అన్ని కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలు, ఆటోమేటిక్ స్లైడింగ్ డోర్‌లతో ప్రయాణీకుల భద్రతను మెరుగుపరిచింది. దివ్యాంగ (విభిన్న సామర్థ్యం గల) స్నేహపూర్వక వాష్‌రూమ్‌లు, బ్రెయిలీ లిపిలో సీట్ హ్యాండిల్ నంబర్‌లు, ఎల్ఈడీ లైట్లు, 360-డిగ్రీల రొటేటబుల్ సీట్లు వంటి ఇతర ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ పాల్గొన్నారు.

'ఆరోగ్యం బాగోలేక విశ్రాంతి తీసుకున్నా'..

ఊహాగానాల వార్తలపై అజిత్ పవార్ స్పందన

ముంబై: తాను ఎవరికీ అందుబాటులో లేనంటూ మీడియాలో వచ్చిన కథనాలు, ఊహాగానాలపై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నేత అజిత్ పవార్ వివరణ ఇచ్చారు. తన ఆరోగ్యం బాగోలేక విశ్రాంతి తీసుకున్నానని ఆయన శనివారం తెలిపారు. శుక్రవారం నాటి కార్యక్రమాలకు దూరంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ, గత కొన్ని రోజులుగా మహారాష్ట్ర అంతటా ప్రయాణించాననీ, తగినంత విశ్రాంతి, నిద్ర లేకపోవడం వల్ల పల్మనరీ ఇరిటేషన్ పెరిగినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో డాక్టర్ల సలహా మేరకు మందులు వేసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకున్నట్లు చెప్పారు. 'నేను కూడా మనిషినే. ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉంది. అలాంటి సమయాల్లో మీడియా ఊహాగానాలు చేయడం మానాలి. ఏదైనా వార్తను ప్రచురించే ముందు ధృవీకరించాలి. మేము పబ్లిక్ ఫిగర్స్, కానీ ఈ విధంగా మా పరువు తీయడం తప్పు' అని అన్నారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతలను ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఆదివారం జరిగిన ఒక బహిరంగ సభలో మోదీకి అనుకూలంగా అజిత్ పవార్ మాట్లాడారు. 2014లో మోదీ డిగ్రీ ఆధారంగానే ప్రజలు ఓటేశారా? అని ప్రశ్నించారు. చరిష్మా వల్లనే ఆయన ఎన్నికల్లో గెలిచినట్లు చెప్పారు. 'ఆయన (మోదీ) తొమ్మిదేళ్లుగా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన డిగ్రీ గురించి అడగడం సరికాదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యలపై ఆయనను ప్రశ్నించాలి. ప్రధాన మంత్రి డిగ్రీ ముఖ్యమైన అంశం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2019 నవంబర్‌లో బీజేపీతో చేతులు కలిపిన అజిత్ పవార్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం ఫడ్నవీస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఎన్సీపీని చీల్చేందుకు ప్రయత్నించారు. అయితే ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, కుటుంబ సభ్యులు బుజ్జగించడంతో తిరిగి పార్టీ పక్షాన నిలిచారు. కాగా, అజిత్ పవార్ మళ్లీ బీజేపీకి మద్దతుగా మోదీ పక్షాన మాట్లాడటం, శుక్రవారం నాటి కార్యక్రమాలకు దూరంగా ఉండటం, ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో తిరిగి ఆయన బీజేపీతో మంతనాలు జరుపుతున్నారా? అన్న ఊహాగానాలు మీడియాలో వెల్లువెత్తాయి.

కర్నాటకలో తనిఖీలు పెంచిన ఈసీ

బోనీ కపూర్ కారులో వెండి వస్తువులు స్వాధీనం

దావణగెరె: కర్ణాటకలో మరికొద్ది రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఎన్నికల్ కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు పెంచింది. ఈ తనిఖీల్లో భాగంగా బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్‌కు చెందిన కారులో వెండి వస్తువులను అధికారులు సీజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. దావణగెరె శివారులో గల హెబ్బళు టోల్ సమీపంలో ఈసీ అధికారులు తనిఖీలు చేస్తుండగా ఓ బీఎండబ్ల్యూ కారులో భారీగా వెండి వస్తువులను గుర్తించారు. ఐదు బాక్సుల్లో చెన్నై నుంచి ముంబై తరలిస్తున్న ఈ వస్తువులకు సరైన పత్రాలు చూపించలేదు. దీంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 66 కిలోల వెండి గిన్నెలు, స్పూన్లు, ప్లేట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.39లక్షల పైనే ఉంటుందని చెప్పారు. ఇందుకు సంబంధించి కారు డ్రైవర్ సుల్తాన్ ఖాన్, వాహనంలో ఉన్న మరో వ్యక్తి హరి సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో ఈ కారు బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్‌కు చెందిన బేవ్యూ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థపై రిజిస్టరై ఉన్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. హరిసింగ్‌ను విచారించగా.. ఆ వస్తువులు బోనీ కపూర్ కుటుంబానికి చెందినవేనని చెప్పినట్లు సమాచారం. ఆ వస్తువులకు సరైన పత్రాలు చూపించని కారణంగానే వాటిని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అవి బోనీ కపూర్ కుటుంబానికి చెందినవేనా? కాదా? అన్న విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు డబ్బులు, వస్తువులు పంచుతున్నారన్న ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈసీ దీనిపై ప్రధానంగా దృష్టిపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

మహారాష్ట్రలో అలజడి సృష్టించిన 30 మంది అరెస్ట్

థానే : మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఒక దేవాలయం సమీపంలో చట్టవిరుద్ధంగా సమావేశమై అల్లకల్లోలం సృష్టించినందుకు 30 మందిపై నేరం నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్‌లు 143 (చట్టవిరుద్ధమైన సమావేశాలు), 447 (నేరపూరిత అతిక్రమణ), 506 (నేరపూరిత బెదిరింపు), ఇతర సంబంధిత నిబంధనల ప్రకారం నేరం అని ఒక అధికారి తెలిపారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ దేవాలయం వద్ద పెద్ద ఎత్తున గుమిగూడి వీరంగం సృష్టించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హనుమాన్ ఆలయాన్ని నిర్మించే స్థలంపై వివాదం ఉందని, ఫిర్యాదుదారు, ఆమె కుటుంబం కొనుగోలు చేసి అక్కడ చాల్‌ను నిర్మించినట్లు అధికారి తెలిపారు.

కేరళలో 174 కుటుంబాలకు ఇళ్లు అప్పగింత

కన్నూర్: కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ కలల ప్రాజెక్టు 'లైఫ్ మిషన్' ద్వారా నాలుగు జిల్లాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు విజయన్ ప్రభుత్వం శనివారం ఇంటి తాళాలు అప్పగించింది. రాష్ట్రంలో ఇళ్లులేని, భూమి లేని పేదలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రాజెక్టు లైఫ్‌ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. కన్నూరు, కొల్లాం, కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లో ఆర్థికంగా వెనుకబడిన 174 కుటుంబాలకు ఇళ్లను అప్పగించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కేరళలో ఇల్లు లేని కుటుంబం ఉండకూడదన్నది విజయన్ ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా వేగవంతంగా ఈ పథకాన్ని ముందుకు తీసుకెళుతోంది. ఒక్కో లబ్దిదారుడికి అందజేసిన ఇంటిలో హాలు, రెండు బెడ్‌రూమ్‌లు, వంటగది, స్నానాల గది, బాల్కనీ ఉంటాయని అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఈ ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం నాణ్యతతో అందంగా, ఆహ్లాదకర వాతావరణంలో, అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మించింది. 'అందరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ లక్ష్యం. ఈరోజు నాలుగు హౌసింగ్ కాంప్లెక్స్‌లలో ప్రారంభించాం. 174 మంది పేదల కల నెరవేరింది. లైఫ్ మిషన్ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 3,40,040 మంది లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాం. ఈ ఏడాది 1.6 లక్షల ఇళ్లు పూర్తికాబోతున్నాయి' అని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ట్వీట్ చేశారు.

కన్నూరుకు సమీపంలోని కదంబూరులో 44 కుటుంబాలకు ఇంటి తాళాలను విజయన్ అందించారు. అలాగే దక్షిణ కొల్లాంలోని పునలూర్ వద్ద మంత్రులు కేఎన్ బాలగోపాల్, జె.చించురాణి, కొట్టాయం జిల్లాలోని విజయపురంలో మంత్రి వీఎన్ వాసవన్, ఇడుక్కి జిల్లా కరిమన్నూర్‌లో మంత్రి రోషి అగస్టీన్ చేతుల మీదుగా ఇంటి తాళాలను లబ్ధిదారులు అందుకున్నారు.

లైఫ్ మిషన్ ప్రాజెక్టుకు సమాజంలోని అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోందని సీఎం విజయన్ చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా 3.40 లక్షల మంది లబ్ధిదారులకు ఇప్పటి వరకు ఇళ్లు లభించాయన్నారు. గడచిన ఆర్థిక సంవత్సరంలోనే 50 వేల ఇళ్లు పూర్తి చేశామని చెప్పారు. ప్రస్తుతం 64,585 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 71,861 ఇళ్లు నిర్మిస్తామని సీఎం ప్రకటించారు.

రేపటి నుంచి ఇస్రో ఉచిత సర్టిఫికెట్ కోర్స్

న్యూదిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్‌ఎస్) డేహ్రాడూన్ కొత్త సర్టిఫికెట్ కోర్సును అందుబాటులోకి తెచ్చింది. సింథటిక్ అపార్చుర్ రాడార్ (ఎస్‌ఏఆర్) డేటా ప్రాసెసింగ్‌పై అందిస్తున్న ఈ కోర్సులో విద్యార్థులతో పాటు పరిశోధకులు, ప్రభుత్వ సైంటిఫిక్ సిబ్బందికి ప్రవేశం ఉంటుంది. ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఐఐఆర్‌ఎస్ అందిస్తున్న ఈ కోర్సు పూర్తిగా ఉచితం. ఏప్రిల్ 10న ప్రారంభమై 14తో ముగుస్తుంది. ఒక్కో సెషన్ గంటన్నరపాటు సాగుతుంది. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 మధ్య ఆన్‌లైన్ సెషన్ ఉంటుంది. ఈ కోర్సులో పాల్గొనదలిచిన వారు గ్రాడ్యుయేషన్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ఈ కోర్సులో చేరే వారికి రిమోట్ సెన్సింగ్, డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌పై కనీస పరిజ్ఞానం ఉండాలి. కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన టెక్నికల్/సైంటిఫిక్ సిబ్బంది/ ఫ్యాకల్టీ, యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూషన్స్‌లోని పరిశోధకులు సైతం ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. 70 శాతం హాజరు కలిగిన వారికి మాత్రమే సర్టిఫికెట్ అందజేస్తారు. ఈ ప్రోగ్రాములో పాల్గొనదలిచే సంస్థలు, యూనివర్సిటీలు, డిపార్ట్‌మెంట్లు సొంతంగా కో-ఆర్డినేటర్‌ను నియమించుకోవాలి. సదరు కో-ఆర్డినేటర్ ఐఐఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.

ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యధోరణి వీడకపోతే

ప్రత్యక్ష ఆందోళనలు

- రాష్ట్రవ్యాప్త నిరసనలు విజయవంతం
- బొప్పరాజు, పలిశెట్టి

విశాలాంధ్ర-విజయవాడ: ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం ఇంకా చిన్న చూపు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తే ప్రత్యక్ష ఆందోళనా కార్యక్రమాలకు సిద్ధపడతామని ఏపీజేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు, సెక్రటరీ జెనరల్ పలిశెట్టి దామోదరరావు హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎన్టీఆర్ జిల్లా ఏపీజేఏసీ అమరావతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడి లెనిన్ సెంటర్ వద్ద చైర్మన్ దొప్పలపూడి ఈశ్వర్, ప్రధానకార్యదర్శి వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో నల్లకండువాలతో శనివారం ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా పాల్గొన్న బొప్పరాజు, పలిశెట్టి మీడియాతో మాట్లాడుతూ ఈ ఉద్యమం వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా దానికి ప్రభుత్వమే బాధ్యతవహించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ ఒక్క ఉద్యోగి ఆనందంగా లేని పరిస్థితి ఉందనీ, ఒకప్పుడు జీతాలు పెంపుదల కోసం ఉద్యోగులు ఉద్యమం చేసేవాళ్లం, ఇప్పుడు ప్రతి నెలా ఒకటవ తేదీనే జీతాలు/పెన్షన్లులు ఇమ్మని కూడా ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితినెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులసమస్యలు పరిష్కారంలోను, హెల్త్ కార్డులు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల కారుణ్య నియామకాలు అలాగే ప్రభుత్వంలో విలీనం చేసిన ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో కూడా చొరవ చూపకపోవడం బాధాకరం అన్నారు. ఇలాంటి పరిస్థితులలో కూడా ఉద్యోగులు మౌనంగా ఉంటే రానున్న రోజుల్లో ఉద్యోగుల భవిష్యత్ ఏవిధంగా ఉంటుందో ఆలోచించుకొని ఈ మలిదశ ఉద్యమ కార్యాచరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. మలిదశ ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరూ స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొని ఆందోళనా కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని చెప్పారు. అనంతరం ఉద్యోగుల డిమాండ్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నిరసన కార్యక్రమానికి రెవెన్యూభవన్ నుంచి లెనిన్ సెంటర్ వరకు అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులంతా ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, ఏ.సాంబశివరావు, ఎస్ మల్లేశ్వరరావు, వి.అర్లయ్య,డి.శ్రీనివాస్, జి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, బత్తెన రామకృష్ణ, చింతకాయల అప్పారావు తదితరులు నాయకులతో పాటు అధికసంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమ కార్యాచరణ:

ఈ మలిదశ ఉద్యమంలో భాగంగా ఈ నెల 11న ఒక్కరోజు సెల్ డౌన్ కార్యక్రమం చేపట్టనున్నామని, 12న 26 జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల వద్ద ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల సమస్యలుపై నిరసన, 18న సీపీఎస్ ఉద్యోగులు,ఉపాధ్యాయుల సమస్యలపైన, 25న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సమస్యల పైన, 29 న గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పై జిల్లా కలెక్టర్ల కార్యాలయాలవద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15 న మరణించిన సీపీఎస్, పదవీవిరమణ చేసిన ఉద్యోగుల ఇళ్ల సందర్శన, 27 న పెన్షన్ సకాలంలో రాని రిటైర్డు ఉద్యోగుల ఇళ్లను సందర్శిస్తామని వివరించారు.

వేములపల్లి శ్రీకృష్ణ సేవలు మరువలేనివి

వర్ధంతి సభలో వక్తలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు వేములపల్లి శ్రీకృష్ణ 23వ వర్ధంతి సభ హైదరాబాద్, కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో శనివారం జరిగింది. వేములపల్లి శ్రీకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్ శ్రద్ధాంజలి ఘటించారు. సభలో వక్తలు మాట్లాడుతూ సీఆర్ ఫౌండేషన్ స్థాపనకు శ్రీకృష్ణ చేసిన కృషిని కొనియాడారు. ఆయన రచంచిన గేయం "చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి గలవోడా' ప్రాచుర్యాన్నీ గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా, శాసనసభ సభ్యునిగా, విశాలాంధ్ర సంపాదకుడిగా అందించిన తోడ్పాటును శ్లాఘించారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవ రావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, వేములపల్లి శ్రీకృష్ణ కుమారుడు కిరణ్, కోడలు సునీత, వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు సోమూరి తుకారాం, డాక్టర్ పి.సరస్వతి, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు పాల్గొన్నారు. వేములపల్లి శ్రీకృష్ణకు నివాళులర్పించారు. వేములపల్లి శ్రీకృష్ణ కొడుకు, కోడలు కలిసి వృద్ధాశ్రమంలోని వారికి పండ్లు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత జనార్ధనరావు మృతి

నేత్రాలు ఎల్‌వీ ప్రసాద్ నేత్రనిధికి దానం



విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు, కమ్యూనిస్టు నేత పోతినేని జనార్ధనరావు (95) అనారోగ్యంతో శనివారం రాత్రి విజయవాడ ప్రజాశక్తి నగర్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆంగ్లం, సాంఘికశాస్త్రం అధ్యాపకులుగా బాధ్యతలు నిర్వహిస్తూ అంచలంచెలుగా ఎదిగారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అనేకచోట్ల ప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. పదవీ విరమణ తర్వాత విశాలాంధ్ర వంటి పత్రికల్లో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ వంటి అంశాలపై వ్యాసాలు రాశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణకుమార్ ప్రోత్సాహంతో ఆయన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ నేత్రనిధి కేంద్రానికి అందజేశారు. ఆయన మరణం ఉపాధ్యాయ ప్రగతిశీల ఉద్యమాలకు తీరని లోటు. జనార్ధనరావు అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

సాగును సంక్షోభంలోకి నెట్టిన వైసీపీ: యనమల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏటా 12 లక్షల టన్నుల మేర ఆహార ధాన్యాల దిగుబడులు పెరిగాయని రైతు భరోసా విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడడం ప్రజల్ని మోసం చేయడమేనని, వాస్తవానికి రాష్ట్రంలో సాగు దిగుబడి తగ్గిపోవడమే కాకుండా వ్యవసాయరంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆహార ధాన్యాలు గత నాలుగు సంవత్సరాల్లో సంవత్సరానికి 12 లక్షల టన్నులు అధికంగా ఉత్పత్తి అయిందని సీఎం తప్పుడు ప్రకటన చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయరంగం ఇబ్బంది పడటమే కాకుండా కష్టాలు, నష్టాల్లో నడుస్తోందన్నారు. రైతుకి గిట్టుబాటు ధర లేకుండా పోయిందన్నారు. రైతు వ్యవసాయం చేసుకునే పరిస్థితులు లేకుండా చేశారన్నారు. ఖరీఫ్, రబీ క్రాప్ హాలిడేస్ కూడా ఇచ్చారు. జగన్‌మోహన్ రెడ్డి రైతుల మెప్పు పొందాలనే ఆలోచనతో నాలుగు సంవత్సరాల్లో సంవత్సరానికి 12 లక్షల టన్నులు అధికంగా ఉత్పత్తి అయిందని తప్పుడు ప్రకటన చేశారన్నారు. 2017-18లో ఉత్పత్తి 167 లక్షల టన్నులు ఉంది. 2019-20లో 185 లక్షల టన్నులు ఉంది. 2022-23 సంవత్సరంలో 169 లక్షల టన్నులు ఉంది. 2019-20లో 175 లక్షల టన్నులు ఉంది. 175 లక్షల టన్నుల నుంచి 169 లక్షల టన్నులకు పడిపోతే సీఎం పెరిగిందని చెప్పడంలో ఎంత యదార్థముందో అర్థమవుతోందన్నారు.

అవార్డులపై ప్రభుత్వాలకు ఆసక్తి లేదు

హైదరాబాద్: నంది అవార్డులపై ఏపీ ఎఫ్‌డీసీ అధ్యక్షుడు పోసాని కృష్ణమురళీ చేసిన సంచలన వ్యాఖ్యలపై దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. అవార్డ్ కమిటీలో కమ్మ కులస్తులే ఎక్కువ ఉన్నారన్న పోసాని కామెంట్‌ను ఆయన ఖండించారు. ఆ వ్యాఖ్యలు అతని వ్యక్తిగతమని చెప్పారు. సినిమాలు, అవార్డుల విషయాల్లోకి కులాలు, మతాలను తీసుకురావడం కరెక్ట్‌కాదని అన్నారు. ఈ మేరకు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'పోసాని మాటల్లో నాకు ఒకటే అర్థమైంది. 'ఒకప్పుడు అవార్డులు సరిగ్గా ఇవ్వలేదు. ప్రస్తుత ఆంధ్రా ప్రభుత్వం అవార్డులు ఇస్తే సక్రమంగా ఇచ్చేలా చూస్తాం' అన్నట్లు నాకు అనిపించింది. అసలు ఈ అవార్డు వ్యవస్థపై ఏ ప్రభుత్వానికి అంత ఆసక్తి లేదు. 'ఓ వ్యక్తి కేసీఆర్ దగ్గరకు వెళ్లి ఇలాగే అవార్డుల ప్రస్తావన తీసుకొస్తే.. ఎందుకయ్యా ఇదంతా.. అంతా సైలెంట్‌గా ఉన్నప్పుడు ఆ లొల్లిని కదపడం అవసరమా? అన్నారట. ఇది ఎవరో చెప్పగా విన్నాను. ఆయన చెప్పిందీ నిజమే కదా! అసలు లేని అవా ర్డుల గురించి చర్చ ఎందుకు? శక్తి ఉంటే ప్రభుత్వాలను ఒప్పించి అవార్డులు ఇప్పించగలగాలి. లేదంటే సైలెంట్‌గా ఊరుకోవాలి. ఈ చర్చలు, సమావేశాల వల్ల సమయం వృథా తప్ప కలిసొచ్చేది ఏమీ లేదు. అవార్డులు ఇస్తే కులాలకు ఇచ్చారు, నచ్చిన వాళ్లకు ఇచ్చారు అంటారు. ఇవ్వకపోతే ఇవ్వలేదంటారు. సినిమా పరిశ్రమలో ఉన్న అనైక్యత వల్లే ఇలా వెనకబడి ఉన్నాం. పరిశ్రమలో అందరూ కలిసి కట్టుగా ఉండడం నేర్చుకోవాలి. చేసే పనిలో పోటీ ఉండాలి తప్ప... ఈర్ష్య, ద్వేషాల్లో పోటీ ఉండకూడదు. ఇప్పుడు ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన పోటీ కన్నా ఇలాంటివే ఎక్కువ అయ్యాయి. కులతత్వం, గ్రూపిజం ఇవ్వన్నీ పోతేనే పరిశ్రమ బాగుపడుతుంది. వందల కోట్లు పెట్టి తీసిన చిత్రాలే ఆడతాయనే పిచ్చి భ్రమ నుంచి బయటకు రావాలి. ' బలగం' లాంటి చిన్న సినిమాలు కూడా సంచలనం సృష్టిస్తాయి" అని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

'ఆర్‌ఆర్‌ఆర్'కు అభినందన వేదిక

తెలుగు సినిమాకు ప్రతిష్ఠాత్మక 'ఆస్కార్' అవార్డు వచ్చింది. పరిశ్రమ నుంచి ఎవరూ ముందుకొచ్చి 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర బృందాన్ని అభినందించే ప్రయత్నం చేయలేదన్న ప్రశ్నకు 'నామినేషన్‌కి వెళ్లిన రోజే పరిశ్రమ తరఫున 'ఆర్‌ఆర్‌ఆర్' బృందాన్ని పెద్ద వేదికగా అభినందించాలనుకున్నాం. రాజమౌళి టీమ్ అవార్డు వచ్చిన తర్వాత చూద్దామన్నారు. ఈ మధ్యనే చాంబర్ తరపున అడిగాం.. సినిమాకు సంబంధించిన అందరూ అందుబాటులోకి వచ్చాక ఏర్పాటు చేయాలనుకున్నాం. ఆదివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం" అని సమాధానమిచ్చారు.

అదానీ వ్యవహారంపై

సుప్రీం కమిటీకి పరిమిత నిబంధనలే

- ప్రధాని మోదీ-అదానీ బంధాన్ని వెలికితీయలేదు
- కాంగ్రెస్ పార్టీ



న్యూదిల్లీ: అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ పరిశోధనా నివేదికను పరిశీలించే సుప్రీం కోర్టు కమిటీ పరిమిత నిబంధనలను కలిగి ఉందని, ప్రధాన మంత్రి, బిలియనీర్ వ్యాపారవేత్త మధ్య లోతైన బంధాన్ని బయటకు తీసుకు రాలేదని కాంగ్రెస్ శనివారం పేర్కొంది. అదానీ సమస్యపై విచారణకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కంటే ఈ ప్యానెల్ మరింత ఉపయోగకరంగా, ప్రభావవంతంగా ఉంటుందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధినేత శరద్ పవార్ చెప్పిన వెంటనే ఈ వ్యాఖ్యలు వచ్చాయి. 'సుప్రీం కోర్టు కమిటీకి చాలా పరిమిత నిబంధనలున్నాయి. ప్రధాన మంత్రి, అదానీ మధ్య ఉన్న లోతైన బంధాన్ని ఇది బయటకు తీసుకురాదు' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. '100 లేదా అంతకంటే ఎక్కువ ప్రశ్నలతో కూడిన హక్ (హమ్ అదానికే హై కౌన్) శ్రేణికి ఒక్క జేపీసీ మాత్రమే సమాధానాలను కనుగొనగలదు. మరిన్ని పుట్టుకొస్తున్నాయి. 1992, 2001లో జేపీసీలు రెండూ విలువైన కసరత్తులు చేశాయి' అని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కూడా హిందీలో ట్వీట్ చేస్తూ, 'వాళ్ళు నిజాన్ని దాచిపెడతారు. అందుకే ప్రతిరోజూ తప్పుదోవ పట్టిస్తారు! అదానీ కంపెనీల్లో రూ.20 వేల కోట్ల బినామీ సొమ్ము ఎవరిది?' అనే ప్రశ్న అలాగే ఉంది' అని పేర్కొన్నారు. అలాగే అదానీ పేరుతో ఒక చిత్రాన్ని కూడా ఆయన ఉంచారు. దానిలో "గులాం, సింధియా, కిరణ్, హిమంత, అనిల్' పేర్లను విలీనం చేసి, అదానీ సమస్య నుంచి దృష్టిని మరల్చడానికి ఈ సమస్యలను లేవనెత్తుతు న్నట్లు తన వాదనను ఆయన నొక్కి చెప్పారు. ఈ కాంగ్రెస్ నేతలంతా కాంగ్రెస్‌ను వీడి, కొందరు బీజేపీలో చేరి వార్తల్లో నిలిచారు. రాహుల్ గాంధీ ట్వీట్‌పై జైరాం రమేశ్ మాట్లాడుతూ పట్టాలు తప్పండి, వక్రీకరించండి, దారి మళ్లించండి, పరువు తీయండి. ఇది మిస్టర్ ఎం 4డి పాలసీ' అని అన్నారు. అయితే సుప్రీం కోర్టు ప్యానెల్‌ను సమర్థి స్తున్న పవార్ మాట్లాడుతూ 'నేను జేపీసీకి పూర్తిగా వ్యతిరేకం కాదు. జేపీసీలు ఉన్నాయి. నేను కొన్ని జేపీసీలకు చైర్మన్‌గా ఉన్నాను. మెజారిటీ (పార్లమెంటులో) ఆధారంగా జేపీసీ ఏర్పాటవుతుంది. జేపీసీకి బదులుగా, సుప్రీం కోర్టు కమిటీ మరింత ఉపయోగకరంగా, ప్రభావవంతంగా ఉంటుందని నేను అభిప్రాయపడుతున్నాను' అని తెలిపారు. గౌతమ్ అదానీకి చెందిన సంస్థల్లో వాటాల తారుమారు, ఖాతాల మోసం ఆరోపణలను బయటపెట్టిన అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ పరిశోధన సంస్థ పూర్వాపరాల గురించి తెలియదని ఆయన అన్నారు. అదానీ వ్యవహారంలో జేపీసీ విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. అయితే అదానీ గ్రూప్ ఆరోపణలను తోసిపుచ్చింది. 'ఒక విదేశీ కంపెనీ దేశంలోని పరిస్థితి గురించి ఒక వైఖరి తీసుకుంటుంది. దీనిపై ఎంత దృష్టి పెట్టాలో నిర్ణయించుకోవాలి. దీనికి (జేపీసీ) బదులుగా, సుప్రీం కోర్టు ప్యానెల్ మరింత ప్రభావవంతంగా ఉంటుందని పవార్ తెలిపారు. కాగా ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవార్ మాట్లాడుతూ పవార్ అదానీ గ్రూప్‌కు మద్దతుగా వచ్చారు మరియు సమ్మేళనంపై హిండెన్‌బర్గ్ పరిశోధన నివేదిక చుట్టూ ఉన్న కథనాన్ని విమర్శించారు. 'ఇలాంటి ప్రకటనలు ఇంతకుముందు కూడా ఇతర వ్యక్తులు ఇచ్చారు. కొన్ని రోజులు పార్లమెంటులో గందరగోళం జరిగింది. అయితే ఈసారి ఈ అంశానికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడింది' అని ఆయన తెలిపారు.

నిధులు విడుదల చేయండి

ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం వినతి

విశాలాంధ్ర-గుంటూరు: కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థికసంఘం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 5వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేసి గ్రామ పంచాయతీలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సర్పంచ్‌ల సమావేశం శనివారం జరిగింది. అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూదిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ జాస్తి వీరాంజనేయులును ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ సీఈఓ నుంచి అవార్డు అందుకున్న గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెం సర్పంచ్ ఆదుదల సాంబశివరావును సన్మానించారు. అనంతరం పాపారావు మీడియాతో మాట్లాడుతూ సర్పంచ్‌ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. నిధులు విడుదల కాకుంటే పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలను బలోపేతం చేసే దిశగా జాస్తి వీరాంజనేయులు దేశవ్యాప్తంగా పర్యటించడం అభినందనీయమన్నారు. అఖిల భారత పంచాయతీ పరిషత్తులో అనేక సంవత్సరాలుగా జాతీయ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ సర్పంచ్‌లకు, స్థానిక సంస్థలకు చేదోడు వాదోడుగా ఉన్నారని కొనియాడారు. స్థానిక సంస్థల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరుదల సాంబశివరావు, చుండూరు సర్పంచ్ ఉయ్యూరు అప్పిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, తాడికొండ సర్పంచ్ తోకల సరోజినీ నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, సర్పంచ్ మబ్బు శిరీష సుధాకర్, సర్పంచ్‌ల మండల ఉపాధ్యక్షులు, తురకపాలెం సర్పంచ్ డప్పురు సూర్యప్రకాశరావు, సర్పంచ్‌లు నల్లిపోయిన శ్రీనివాసరావు, ఎన్.లలిత కుమారి, కె.అశోక్ కుమార్, దాడి లక్ష్మి సుబ్బారావు, శివారెడ్డి, బ్రహ్మారెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీట్ల కేటాయింపుపై బీజేపీ తర్జనభర్జన

న్యూదిల్లీ: కర్నాటకలో పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఎన్నికల వేడి రాజుకుంటోంది. ప్రధాన ప్రతిపక్షా లైన కాంగ్రెస్, జేడీఎస్ ఇప్పటికే తమ అభ్యర్థుల పేర్లను దాదాపు ఖరారు చేసి ప్రచారాన్ని ఉధృతం చేశాయి. కానీ, పాలక బీజేపీ ఇప్పటి వరకు అభ్యర్థుల జాబితాను ప్రకటించలేదు. అభ్యర్థుల విషయంలో కాషాయ పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. పార్టీ ఫిరాయింపులు కూడా ఇందుకు ఒక కారణమే. అభ్యర్థులను నిర్ణయించే అంశంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్పతో సహా అనేక మంది ముఖ్యనేతలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఆదివారం బీజేపీ పార్లమెంటరీ బోర్డు మరోసారి సమావేశమై అభ్యర్థుల పేర్లను ఖరారు చేయనుంది. నడ్డాతో భేటీకి ముందు సీఎం బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ.. సీటు వచ్చే అవకాశమున్న వారందరి పేర్లను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రతి జిల్లా, నియోజకర్గాల వారీగా పూర్తి సమాచారం తమ వద్ద ఉందని, ఇటీవల అంతర్గతంగా నిర్వహించిన సర్వే అంశాలను కూడా అందులో పొందుపరిచి పార్టీ జాతీయస్థాయి నాయకులతో చర్చిస్తామని తెలిపారు. 'రాష్ట్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం. మొత్తం 224 స్థానాలకు గానూ కచ్చితంగా 150చోట్ల విజయం సాధిస్తాం' అని బసవరాజ్ బొమ్మై ధీమా వ్యక్తం చేశారు. ఒకే విడతలో అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా కొన్ని నియోజకవర్గాలకు మినహా దాదాపు అన్ని చోట్లా అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశముందని చెప్పారు. పార్లమెంటరీ పార్టీ ఆమోదం తెలిపిన అభ్యర్థుల పేర్లను ఆదివారం సాయంత్రం అధికారికంగా ప్రకటించనున్నారు.





Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.